ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం

# DST-191

# AGRICULTURAL EXTENSION AND RURAL DEVELOPMENT

## వ్యవసాయ విస్తరణ మరియు గ్రామీణాభివృద్ధి

**Dr. M. C. Obaiah**, Assoc. Prof (Extension)

Agricultural Polytechnic, Podalakur

**Dr. Y. Gurunadha Rao**, Director

NRR Agricultural Polytechnic, Neliparthi, Salur

Assisted by

**Vijay kumar bomidi**

NRR Agricultural Polytechnic, Neliparthi

# అధ్యాయము - 1
## విద్య (Education)

* "విద్య లేనివాడు వింతపశువు" అనే సామెత వల్ల మన దేశంలో విద్యకు గల ప్రాముఖ్యత చాలా కాలం క్రతవే గ్రహించారు.
* వ్యక్తుల ప్రవర్తన, విజ్ఞానం, ధృక్పథం, నైపుణ్యం, వారివైఖరులు, నమ్మకాలలో మంచి మార్పు తీసుకు వచ్చేదే "విద్య".
* విద్యలో మూడు రకాలు ఉన్నాయి - (1) నియత విద్య (Formal education)
(2) అనియత విద్య (Informal education)
(3) విస్తరణ విద్య (Non-formal education)
* **నియత విద్య (Formal education) :**

  పాథమిక పాఠశాల నుండి విశ్వవిద్యాలయాల్లో ఒకే పద్ధతిలో పాఠ్యాంశాలను, ఆయా పాఠ్యాంశాలలో తరిఫీదు పొందిన వారుచెప్తారు.
* **అనియత విద్య (Informal education) :**

  ఒక ప్రణాళికననుసరించి విద్యాభోదన జరగదు. వ్యక్తులు వారి వారి అనుభవాల నుండి లేదా వంశపారపర్యంగా వచ్చు అనుభవాలతో సంపాదించే విజ్ఞానాన్ని "అనియత విద్య" అంటారు.
* **విస్తరణ విద్య (Non-formal education) :**

  కొన్ని ప్రధాన విషయాలను అవసరమైన సమయాల్లో అధిక జనాభాకు తెలిసే విధంగా తెలిపే విద్యను "విస్తరణ విద్య" అంటారు.

**నియత - అనియత విద్యాబోధనలో గల భేదాలు (లేదా) తరగతిలో - గ్రామంలో విద్యాబోధనలో గల బేధాలు :**

**(Differences between Formal and Non – formal education)**

| | **నియత విద్య (Formal)** | | **గ్రామంలో విస్తరణ విద్య (Non-formal)** |
|---|---|---|---|
| 1. | పాఠశాలలో ఒక క్రమపద్ధతిలో చెప్పే విద్య | 1. | క్రమ పద్ధతిలో లేక ప్రజలకు కావలసిన విషయాలపై వారికి అవగాహన కల్పించ బడుతుంది. |
| 2. | యువతీ యువకులకు అభివృద్ధి మార్గాలను తెలియ పరచడమే ముఖ్య ఉద్దేశం. | 2. | యువతీ యువకులకు, పెద్దవారికి వాస్తవజీవితంలో ఉపయోగపడే అభివృద్ధి విధానాన్ని తెలియపర్చడం. |
| 3. | తరగతిలో హాజరు తప్పనిసరి. | 3. | చెప్పే విషయాలపై ఆసక్తికలవారు పాల్గొంటారు. పాల్గొంటారు. పాల్గొనాలని ఎటువంటి నిర్బంధం లేదు. |
| 4. | తరగతిలో ఇంచుమించు ఒకే వయస్సు కల విద్యార్థులుంటారు. | 4. | వయస్సుతో నిమిత్తం లేదు. చెప్పే విషయంలో ఆసక్తి కలవారు ఏ వయస్సు వారైనా పాల్గొనవచ్చు. |
| 5. | ఇంచుమించు ఒకే వయస్సు వారుండడం వల్ల గ్రహనశక్తి అధికంగా వుండడం వల్ల బోధన సులభం. | 5. | సాధారణంగా అనియత విద్యలో వయస్సులో పెద్దవారుండడం వల్ల గ్రహణశక్తి తక్కువ. అందువల్ల బోధన కష్టమవుతుంది. |
| 6. | విద్యార్థుల విద్యాస్థాయి ఒకే స్థాయిలో | 6. | అన్ని రకాల వయస్సువారుండడం వల్ల వారి విద్యాస్థాయి |

| | | | |
|---|---|---|---|
| | వుండడం వల్ల బోధనాపద్ధతి ఒకే లాగుంటుంది. | | ఒకలాగ వుండదు. అందువల్ల బోధనా పద్ధతులు వారికి తగినట్లుగా వేర్వేరుగా వుంటాయి. |
| 7. | విద్యార్థులు వయస్సులో చిన్నవారు కాబట్టి వారికి ఎటువంటి మూఢనమ్మకాలు ఉండవు. కనుక వారికి బోధించడం సులభం. | 7. | గ్రామస్థులకు మూఢనమ్మకాలుండడం వల్ల బోధించుట కష్టము. |
| 8. | తరగతి కాలనిర్ణయపట్టిక (TimeTable)ప్రకారం పాఠములు చెప్పబడును. | 8. | విస్తరణ ప్రణాళిక సమయానుకూలంగా మార్పులు చేసుకోవడానికి వీలుంటుంది. |
| 9. | విద్యార్థులకు వారు చదివిన పాఠ్యాంశము లపై పరీక్షలు జరుపబడును. | 9. | నిర్దిష్ట పాఠ్యాంశములు ఉండవు. పుస్తకాలతో గాని, పరీక్షలతో గాని సంబంధం లేదు. |
| 10. | తరగతిలో నిర్ణీత విద్యార్థుల సంఖ్య ఉండ డం వల్ల అందరికీ బోధిస్తారు. | 10. | గ్రామాలలో మొత్తం ప్రజానీకానికి ప్రత్యక్షంగా బోధించడానికి వీలుకాదు. |
| 11. | తరగతిలో విద్యార్థులు చిన్నవారు కాబట్టి వయస్సులో పెద్దవారైన ఉపాధ్యాయులు బోధించిన విధంగా నడుచుకుంటారు. | 11. | గ్రామస్థులు విస్తరణ కార్యకర్తల కంటే వయస్సులోనూ, అనుభవంలోనూ పెద్దవారు కాబట్టి బోధన కష్టతర మవుతుంది. |
| 12. | తరగతిలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు బోధిస్తారు. ఎందుకంటే పిల్లల అనుభవాలు ఉపాధ్యాయుల అనుభవాల కంటె తక్కువ. | 12. | గ్రామస్థుల నుండి అనుభవపూర్వకమైన విషయాలను విస్తరణ కార్యకర్తలు నేర్చుకుంటారు. |

## అధ్యాయము - 2
## విస్తరణ విద్య (Extension Education)

**ఉపోద్ఘాతం :**

* పపంచంలో అభివృద్ధి చెందుతున్నదేశాలు మరియు చెందుతున్న దేశాల ప్రజలు వారిదేశాలు సుసంపన్నం కావాలని కోరుకుంటారు.
* దేశ ఆర్థిక పరిస్థితులు ఆయాదేశాలలో లభించే ప్రకృతి వనరులపై ఆధారపడి వుంటాయి.
* దేశంలో లభించే వనరులను బట్టి - వాటి అభివృద్ధి కొరకు శాస్త్రీయ (Scientific)మరియు సాంకేతిక (Technology) విజ్ఞానాని ప్రజలకు అందించి, వారు ఆచరించేటట్లు చేసి వారికున్న వనరుల నుండి అధిక లాభాలను పొందేటట్లు చేయడమే విస్తరణ విద్య యొక్క ప్రధాన లక్ష్యం.
* పరిశోధనాలయాలలో జరిగే పరిశోధనలు - వాటి నుండి వచ్చే పరిశోధనా ఫలితాలు - రైతులకు అందించాలి (Lab to Land).
* పరిశోధనా ఫలితాలు మట్టుకు రైతుల ఆర్థిక స్థితిననుసరించి తక్కువ ఖర్చుతో మరియు ఆచరణ యోగ్యంగా వుండాలి.

* విస్తరణ విద్య మొట్టమొదట U.S.A లో లాండ్ గ్రాంటు కాలేజీలో ప్రవేశపెట్టబడినది. తర్వాత మనదేశంలో అన్ని విశ్వవిద్యాలయాలుఆ పద్ధతిని అనుసరించాయి.
* విస్తరణ విద్య పాఠశాలలో పిల్లలకు చెప్పే విధంగా కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండల వద్ద లేదా ఊరిలోగల యితర వేదికలు గ్రామచావడిలు, గుడులు మొ॥ గ్రామస్థులకు వీలైన సమయాలలో వారికి చక్కగా అర్థమయ్యే ఆ ప్రాంతపు భాషలో విశదీకరించి చెప్పే విద్యనే "విస్తరణ విద్య" అంటారు.
* భారతదేశం ముఖ్యంగా వ్యవసాయిక దేశం కాబట్టి "వ్యవసాయ విస్తరణ విద్య" గ్రామీణ ప్రజలకు ఎంతైనా ఉపయోగపడుతుంది.
* విస్తరణ విద్యలో రెండు ముఖ్యాంశాలు గమనించాలి.

  1) సాంకేతిక విజ్ఞానాన్ని ఏ విషయాన్ని ఏ విధంగా అందజేయాలి.

  అందువలన పైన పేర్కొనబడిన రెండు విషయాలను ముందుగా విస్తరణాధికారులు బాగా అధ్యయనం చేయాలి.

**విస్తరణ విద్య (Extension Education):**

Extension అన్న పదాన్ని లాటిన్ భాషనుండి గ్రహించబడినది.

Ex = Out, tensio = stretched

Extension = streatched out (విస్తరింపజేయుట)

* విస్తరణ విద్య విద్యాలయాల్లో బోధనవలె కాకుండా గ్రామాల్లో లేదా రైతుల పొలాల్లో భోదింపబడే విద్య.

**విస్తరణ విద్య - నిర్వచనం :**

* దేశ ప్రజలకు అధికంగా లభించే వనరులను ఉపయోగించేటప్పుడు అనేక సమస్యల నెదుర్కొంటారు. ఆ సమస్యలను తీసుకుని వాటిపై విస్తృత పరిశోధనలు చేసి తద్వారా వచ్చిన పరిశోధనా ఫలితాలను ప్రజలకందజేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడమే "విస్తరణ విద్య" (ExtensionEducation) యొక్క ప్రధానలక్ష్యం.
* సాంకేతిక పరిజ్ఞానం చౌకగాను, ఆచరణ యోగ్యంగానూ (సామాన్యులు కూడ ఆచరించే విధంగా) ఉండాలి.

**విస్తరణ విద్య - విధాన కార్యక్రమము (Dr. J. Paul Leagans):**


ఈ క్రింది పటములో విస్తరణ విద్య - విధాన కార్యక్రమము చూపబడినది. పటంలో 5 దశలు చూపబడినవి.

1. పరిస్థితి - సమస్యలు - విశ్లేషణ (Analysis of the situation)
2. ఉద్దేశ్యాలు - పరిష్కారాలు (Aims and solutions)
3. పరిష్కారాన్ని బోధన ద్వారా చెప్పుట (Teaching)
4. మూల్యాంకనము (Evaluation)
5. పునరావలోకనం (Reconsideration)

**1. పరిస్థితి - సమస్యలు - వాస్తవ సమాచారము - విశ్లేషణ :**

* పరిస్థితిని విశ్లేషించుటకు ఆ పరిస్థితికి సంబంధించిన వాస్తవ సమాచారాన్ని రాబట్టాలి. అనగా సమస్య ఏమిటి ? ఆ సమస్యవలన నష్టాలు లేదా లాభాలు - ప్రజలకు గల ఆసక్తి - విద్య - వారికి ఏమికావాలి - వారి సాంఘిక ఆచారాలు - వారి మనస్తత్వాలు - వారిభౌతిక, ఆర్థిక, పరిస్థితులు ఏమిటి-అన్న విషయాలనన్నిటిని సంగ్రహించి - దానిని విశ్లేషించాలి.

* విశ్లేషణలో ఆసమస్యకు గల ముఖ్య కారణాలు - సమస్యను అధిగమించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి అనే వాటిని తెలుసుకోవాలి.




విస్తరణ విద్యా విధాన క్రమము యొక్క భావము
(A Concept of Extension Educational process)
Dr. J. Paul Leagans.

**2. ఉద్దేశాలు - పరిష్కారాలు :**

* సాధారణ ఉద్దేశాలు మరియు ప్రత్యేక ఉద్దేశ్యాల మధ్య తేడా గుర్తించాలి.
* ముఖ్యసమస్యలు, వాటిని తొలగించి సరైన పద్ధతిలో సమస్యల తొలగింపునకు ప్రణాళిక ద్వారా పరిష్కారాలు చేపట్టాలి.
* సూచించిన పరిష్కారాలతో సమస్యలు తొలగి పోవాలి, వారికి సంతృప్తి నివ్వాలి.
* పరిష్కారము సులభమైనది గాను, అతి తక్కువ ఖర్చుతో కూడినటు వంటిదిగా వుండాలి.

**3. బోధన (Teaching):**

బోధనలో - ఎ) ఏమి చెప్పాలి ?

బి) ఎలా చెప్పాలి ?

- * బోధన చేసే వారు ఏమి చెప్పాలి ? ఎలా చెప్పాలి - అన్న విషయాలు నేర్చుకునే వారి స్థాయిని బట్టి ఎంపిక చేసుకోవాలి.
- * తరగతిలో ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పినట్లు కాకుండా నేర్చుకునే వారికివారి భావాలను తెలపడానికి అవకాశమిస్తూ, ఆ భావాలకుతగ్గట్లుగా మన సమాధానాలు చెప్పినపుడు వారు సంతృప్తి చెందుతారు.
- * బోధన చేసేటప్పుడు ముఖ్య ఉద్దేశ్యాన్ని మరిచిపోకూడదు. వేరు పరిస్థితుల వైపు ఉపాధ్యాయుని మరియు నేర్చుకునే వారి దృష్టి మరలకూడదు.
- * బోధనలో నేర్చుకునే వారి స్థాయి, ఉత్తేజాన్ని బట్టి బోధనా పద్ధతులను ఎంచుకోవాలి.

**4. మూల్యాంకనము (Evaluation):**

మూల్యాంకనము ద్వారా చెప్పిన విషయాలను ఎంతవరకు అర్థం చేసుకున్నారు - ఎంత వరకు చెప్పిన విషయాలను ఆచరించారు. ఆచరించిన తర్వాత ఫలితాలు ఎలాగవున్నాయి - అన్న వాటిని మూల్యాంకనము చేసి ఇంకా ఏ పద్ధతుల ద్వారా చెపితే మంచి ఫలితాలు సాధించవచ్చు. అనేది తెలుసుకుంటారు.

**5. పునరావలోకనము (Reconsideration):**

మూల్యాంకనము చేసిన తర్వాత - సాధించిన ఫలితాలతో బాటు కొన్ని పరిస్థితులు బహిర్గతమవుతాయి. ఈ కొత్త పరిస్థితులను ఎదుర్కోడానికి పద్ధతులలో మార్పులు లేదా క్రొత్త పద్ధతులను ఆచరించి సమస్యా పరిష్కారాలను కనుగొనడం - ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

కొత్త పద్ధతి పాత పద్ధతికి విభిన్నంగా వుండాలి - లేదా పాత పద్ధతి కంటె మెరుగైనదై వుండాలి. ఎందుకంటే

- * ప్రజలు మొదటి పద్ధతి ద్వారా మార్పుచెంది వుంటారు.
- * భౌతిక, ఆర్థిక, సాంఘిక మార్పులు జరిగి వుంటాయి.
- * మార్పులననుసరించి క్రొత్త పద్ధతి ఇంకా మెరుగైనదై వుండాలి.

**విస్తరణ - ఉద్దేశ్యాలు (Extension – objectives):**

1. విస్తరణ యొక్క ప్రాథమిక ఆశయము "ప్రజల అభివృద్ధి".
2. ప్రజలు వారి సమస్యలను వారే కనుగొని, విశ్లేషించి దానికి తగిన సమస్యాపరిష్కారములను కనుగొనుటలో సహాయపడుట.
3. ప్రజలలో నాయకత్వ లక్షణాలు గల పురుషులు /స్త్రీలను ఎంపిక చేసి ప్రజల సమస్యలను వారే పరిష్కరించుకొనునట్లు చేయుట.
4. పరిశోధన / అనుభవాలతో వచ్చిన సమాచారము ప్రజల కందించి వారిచే అమలు పరచునట్లు చేయుట.
5. ప్రజల సమస్యలను ఆయాపరిశోధనా స్థానాలకు తెలియజేసి పరిశోధనా ఫలితాల ద్వారా సమస్యలకు పరిష్కారము కనుగొనుట.

**విస్తరణ యొక్క ప్రధాన ఆశయాలను ఈ క్రింది విధంగా వర్గీకరించ వచ్చును :**

| | | |
|---|---|---|
| 1. వ్యవసాయ / పరిశ్రమలు | - | ఉత్పత్తి, ఆదాయాల పెరుగుదల |
| 2. విద్యాసంబంధమైన | - | ప్రజల దృక్పదంలో మార్పు |
| | - | వ్యక్తి గత అభివృద్ధి |
| 3. సాంఘిక / సాంస్కృతిక సంబంధమైన | - | సమాజాభివృద్ధి |

**విస్తరణ సూత్రాలు (Principles of extension):**

1. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి సమాన ప్రాధాన్యత ఉంటుంది.
2. నాగరికత యొక్క ప్రాథమిక ప్రమాణము గృహము.
3. జాతిలో మొదట శిక్షణ పొందవలసినది కుటుంబము.
4. నాగరికతకు పునాది పౌరులకు వారి దేశానికి గల అవినాభావ సంబంధమే (Patriotic nature)
5. విస్తరణ (Extension) యొక్క ప్రధాన ధ్యేయం ప్రతి పౌరుడు ఉన్నత స్థాయికి చేరుకోవడమే. దీనికి ముఖ్యంగా ప్రజలను విద్యావంతులుగాను, బాధ్యతాయుతులుగా చేయాలి. అందుచే వ్యక్తి - కుటుంబము-సమాజములను దృష్టిలో ఉంచుకోవాలి. ఎందువలనంటే వ్యక్తుల సముదాయమే కుటుంబము-కుటుంబాల సముదాయమే సమాజము.

దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగుపడాలంటే ఆ దేశంలో గల వ్యక్తులు, సమాజాన్ని, మారుతున్న పరిస్థితులను దృషిలో పెట్టుకుని నూతన పద్ధతులను ఆచరించుట ఎంతైనా అవసరం.

భారతదేశం వ్యావసాయిక దేశం. దేశ జనాభాలో 70 శాతం ప్రజలు వ్యవసాయంపైన, వ్యవ సాయ అనుబంధ సంస్థల పైన (IndustriesbasedonAgricultural)ఆధారపడి వుండడం చేత వారి ఆర్థిక పరిస్థితి చక్కబడితే దేశ ప్రగతి బాగున్నట్లు చెప్పవచ్చు. వ్యవసాయంలో పంటలు పండించడంలో రైతు అనేక కష్టనష్టాలు అనుభవిస్తున్నాడు. ఈ కష్టాలు తొలగి రైతు ఆర్థికంగా బలపడాలంటే రైతు కష్టాలకు మూలాలు ఏమిటో తెలుసుకుని పరిశోధనా స్థానాలలో పరిశోధనలు చేసి పరిశోధనా ఫలితాలను రైతుకందించడమే “విస్తరణ శాఖ” ప్రధాన లక్ష్యం. అంటే రైతులకు, పరిశోధనా స్థానాలకు మధ్య వారధిగా “విస్తరణ శాఖ” పనిచేస్తుంది.

# అధ్యాయము - 3

## వ్యవసాయ విస్తరణ (Agricultural Extension)

* విస్తరణ సేవ ప్రధమంగా అమెరికాలో వ్యవసాయ, గృహ విజ్ఞాన (Homescience)శాస్త్రాలలో మొదలయింది. తర్వాత నార్వే, స్వీడన్ దేశాలలో వ్యవసాయం, మత్స్య పరిశ్రమ (Fisheries) లలో విస్తరణ సేవలను అందించడం మొదలు పెట్టారు.
* విస్తరణసేవలు ఆయా దేశపరిస్థితులు, ప్రజల అవసరాలు, మొదలైన అంశాలపై ఆధారపడి వుంటాయి.
* భారతదేశము అనేక రంగాలలో వెనుకబడి యుండుటచే ఈ క్రింద పేర్కొనబడిన రంగాలలో విస్తరణ సేవా కార్యక్రమాలకు విస్తృత అవకాశములు కలవు.

1. వ్యవసాయము
2. పశుపోషణ
3. సహకారము
4. పంచాయితీలు
5. విద్య
6. సాంఘిక విద్య
7. పరిశ్రమలు
8. ఆరోగ్యం
9. శిశుసంక్షేమము
10. మత్స్యపరిశ్రమ మొదలైన వానిలో గ్రామీణ ప్రజలను విద్యావంతులుగా చేయుటకు మంచి అవకాశములు కలవు.

**వ్యవసాయ విస్తరణ :**

వ్యవసాయ దారులకు సాంకేతిక పరిజ్ఞానంతో బాటు మేలు రకాల విత్తనాలు, ఆధునిక పరికరాల వినియోగం, మేలురకపు వ్యవసాయ పద్ధతులను గురించి తెలియజేసి అధిక దిగుబడులను సాధించి వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే వ్యవసాయ విస్తరణ శాస్త్రముఖ్యోద్దేశము.

**విస్తరణ విద్య - అవకాశము (Extension Education – Scope):**

1. వ్యవసాయ ఉత్పత్తిని పెంచుటలో సామర్థ్యం పెంచుట
2. అమ్మకము - పంపకము - వాడకంలో సామర్థ్యం పెంచుట.
3. సహజ సంపదల వినియోగం - పరిరక్షణ - అభివృద్ధి.
4. క్షేత్ర, గృహ నిర్వహణ.
5. కుటుంబ జీవనం.
6. యువజనాభి వృద్ధి.
7. సమాజాభి వృద్ధి.
8. పౌరవ్యవహారాలు.
9. నాయకత్వ లక్షణాలు పెంపొందించడం.

# అధ్యాయము - 4

## విస్తరణ బోధనా పద్ధతులు (Extension teaching methods)

**అర్థము (Meaning):**

* ప్రతి మానవుడు స్వయం కృషితో వారి అవసరాలను తీర్చుకోవాలి. వీటి కొరకు విస్తరణ బోధనా పద్ధతులు ఉపయోగపడతాయి.
* విద్యాభ్యాసానికి మంచి బోధనా పద్ధతులు అవసరం.
* మంచి బోధనా పద్ధతులకు విద్యావంతులు, సంస్కారవంతులైన ఉపాధ్యాయులు అవసరం.
* మంచి బోధనల వల్ల విద్యార్థులకు మంచి విద్యను అందించ వచ్చును.
* ప్రజలలో మంచి మార్పులను తీసుకురావడానికి విస్తరణ బోధనా పద్ధతులు ఎంతగానో ఉపకరిస్తాయి.
* విద్య నభ్యసించేవాళ్ల సామర్థ్యాన్ని బట్టి విస్తరణ బోధనా పద్ధతులను ఎన్నుకోవాలి.

**నిర్వచనం :**

బోధించే వారికి, అభ్యసించే వారికి మధ్య మంచి అభ్యాసనా పరిస్థితులను ఏర్పరచి, భావవ్యక్తీకరణకు తోడ్పడే పద్ధతులను "విస్తరణ బోధనా పద్ధతులు" అంటారు.

**ప్రాముఖ్యత (Importance of Extension teaching methods):**

* అభ్యసించే వారికి చూసి, విని, చేసి నేర్చుకోవడానికి తగిన విధంగా బోధనా పద్ధతులను అవలంబించాలి.
* అభ్యసించే వారిలో అభిలషణీయ మానసిక, శారీరక మార్పులను తీసుకుని రావడం.
* అభ్యసించే వారిలో అభ్యసన పద్ధతుల ద్వారా - శ్రద్ధ, ఆసక్తి, కోరిక, నమ్మకం, కార్యసాధన, - సంతృప్తి కలిగించాలి.

## విస్తరణ బోధనా పద్ధతుల విభజన (According to use):

### A. ఉపయోగాన్ని బట్టి (According to use):

#### అ) స్వకీయ పద్ధతులు (Individual methods):

* గృహాలలోను, పొలాలలోను వ్యక్తి గతంగా గ్రామస్థులను కలుసుకొని, మాట్లాడి - వారి అవసరాలను గుర్తించడం.
* గృహాలలో నిరూపణ ప్రయోగాలు (Result demonstrations) ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించడం.
* వ్యవసాయదారులు బ్లాక్ ఆఫీసుకు వచ్చినపుడు విస్తరణ కార్యకర్త వారికి సహాయపడుట.
* ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం
* గ్రామంలోని ప్రజలకు గ్రామపెద్దల ద్వారా గాని లేదా ఉపాధ్యాయుల ద్వారా విషయాన్ని తెలియపర్చడం.

**ఆ) సాముదాయక పద్ధతులు (Group methods):**

* ప్రత్యక్ష ప్రయోగాల ద్వారా తెలియపర్చడం.
* సమావేశాలు నిర్వహించడం (Arrangement of meetings)
* సాముదాయక కలయికలు (Group meetings)
* సాముదాయక చర్చలు (Group discussions)
* అభ్యసించే సముదాయాలు (Learner Groups)
* గ్రామంలో రోజువారీ కలయికలలో చర్చలు
* క్రమరహితంగా ఏర్పడిన సముదాయాలు
* క్రమానుసారంగా ఏర్పడిన సముదాయాలు (యువకమండలి, బాలభవనాలు, మహిళా మండలి)

**ఇ) సామూహిక పద్ధతులు (Mass methods):**

1. టేపు రికార్డులు, రేడియోలు
2. వార్తా పత్రికలు (News papers)
3. ప్రకటన కాగితాలు (Advertisements)
4. చిత్ర పటాలు (Drawings)
5. ఉత్తరాలు (Letter communications)
6. వస్తుప్రదర్శనలు (Exhibitions)
7. నృత్యాలు, సమూహగానాలు (Folk dances, Folk songs)
8. పండుగలు (Festivals)
9. గ్రంథాలయాలు (Libraries)
10. కర పత్రాలు (Handouts)

**B. సాధనాల రూపకల్పనను అనుసరించి (According to form):**

విస్తరణ బోధనా పద్ధతులను ఈ క్రింది విధంగా విభజించవచ్చును.

**1. వ్రాతవల్ల తెలిపేవి (Written):**

* వార్తాపత్రికలు
* ప్రచురణ పత్రాలు
* ఉత్తరాలు
* కరపత్రాలు
* బుక్‌లెట్స్

**2. మాటల వల్ల తెలిపేవి (Spoken):**

* టేప్‌రికార్డులు, రేడియో
* ప్రత్యక్ష ప్రదర్శన
* సాధారణ సమావేశాలు
* అభ్యసించే సముదాయాలు
* క్షేత్రాల, గృహాల సందర్శన
* టెలిఫోన్‌కాల్స్

**3. దృష్టివల్ల తెలిపేవి (Visual or dejective):**

- * వస్తుప్రదర్శన
- * ప్రత్యక్షప్రయోగప్రదర్శన
- * పోస్టర్లు
- * చార్టులు
- * ఫానెల్‌గ్రాఫ్స్
- * మూకీ చిత్రాలు
- * స్లైడ్‌ట్రాన్స్‌పరెన్సీస్
- * తోలుబొమ్మలాటలు

**4. మాట మరియు దృష్టి వల్ల తెలిపేవి (Spoken & Visual):**

- * క్షేత్రసందర్శన
- * నిరూపణ ప్రయోగాల దగ్గర సమావేశాలు
- * టెలివిజన్‌లు
- * టాకీచిత్రాలు

**C. కారకాలు, సమాచారాలను అనుసరించి :**

విస్తరణ పద్ధతులను ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

**1. ప్రతీక వల్ల ఏర్పడే అనుభవాలు :**

శబ్ధ ప్రతీక : ఉదా : రేడియో, టేప్‌రికార్డర్

దృశ్యప్రతీక : ఉదా : చార్ట్స్, రేఖాపటాలు, మ్యాపులు

**2. పరిశీలన వల్ల ఏర్పడే అనుభవాలు :**

మూకీ చిత్రాలు ; టాకీ చిత్రాలు, వస్తుప్రదర్శనలు, విహారయాత్రలు

**3. చేయడం వల్ల ఏర్పడే అనుభవాలు :**

నాటకాలు, పాత్రపోషణ

**బోధనా పద్ధతులను ఎన్నుకోవడంలో ఆలోచించవలసిన అంశములు :**

1. ప్రజల స్వభావం : ప్రజలకు క్రొత్త అంశాలను గురించి తెలుసుకోవాలన్న స్వభావంతో వున్నారా ? లేదా నిర్లిప్తతతో ఉన్నారా.
2. ప్రజల అక్షరాస్యత : అక్షరాస్యతా స్థాయి ననుసరించి బోధనా పద్ధతుల నెన్నుకోవాలి.
3. ఆర్థిక పరిస్థితులు : గ్రామస్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చే ముందు సాంకేతిక పరిజ్ఞానాని కయ్యే ఖర్చు భరించగలరా ? అట్టి పరిస్థితులలో ఏ విధమైన బోధనా పద్ధతినిఎన్నుకోవాలి.
4. పూర్వానుభవాలు : లోగడ గ్రామాభివృద్ధి కొరకు చేపట్టిన కార్యక్రమములు విజయ వంత మయ్యాయా- లేదా - గ్రామస్థుల కుండే విశ్వాసము, ప్రభుత్వసహాయం విస్తరణ కార్యకర్తల పై నమ్మకము మొదలైనవి.
5. గ్రామభౌతిక పరిస్థితులు : గ్రామమున్న స్థలము, రవాణా సౌకర్యాలు, గ్రామజనాభా మొదలైనవి. గ్రామానికి గల వనరులు.
6. సాంఘిక కారకాలు : మార్పులకు ఇష్టపడుతున్నారా ? లేదా నిరోధిస్తున్నారా ?

7. విస్తరణ కార్యకర్తలు : పైన పేర్కొనబడిన అంశాలను (1-6) దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు సరైన విస్తరణ పద్ధతులు నెన్నుకుని గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలి. ఆ పద్ధతులు గ్రామస్థులకు అనుకూలంగా ఉండవలెను.

## వివిధ బోధనా పద్ధతుల ఉపయోగాలు మరియు హద్దులు

పైన పేర్కొనబడినట్లు బోధనా పద్ధతులు మూడు విధాలుగా వుంటాయి.

1. స్వకీయ (Individual), 2. సామూహిక (Mass), సాముదాయక (Group) పద్ధతులు. ఈ పద్ధతులలో ఉపయోగాలు (Uses) మరియు హద్దులు (Limitations) ఈ క్రింద తెలుపబడినవి.

**1. స్వకీయ పద్ధతులు (Individual methods) :**

**ఎ) ఈ పద్ధతిలో గ్రామస్థులను వారి గృహాలలో గాని, వారి క్షేత్రాలలో కలిసి చర్చించుట :**

**ఉపయోగాలు (Uses):**

1. గ్రామంలో అతి ముఖ్య సమస్యలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది.
2. పరస్పర వ్యక్తిగత సంబంధం వల్ల మంచి అభిప్రాయాలు ఏర్పడతాయి.
3. విస్తరణ కార్యక్రమాలలో పని చేసేవారికి, గ్రామస్థులకు ఒకరి పట్ల ఒకరికి నమ్మకం ఏర్పడి కార్యకర్తలు సూచించిన ప్రతివిషయాన్ని అమలుపరచడానికి ముందంజ వేస్తారు.
4. గ్రామంలో ఆసక్తి కలిగిన నాయకులను ఎన్నుకోవడం వలన ఉద్దేశించిన కార్యక్రమం సులభంగా కొనసాగుతుంది.
5. కాలాన్ని బట్టి, అవసరాలను బట్టి కావలసిన సాధనాలను అందజేయడం వల్ల ప్రణాళిక సరైన రీతిలో కొనసాగుతుంది.
6. అంగీకారాలు మరియు ప్రయత్నాల మధ్య నిష్పత్తి ఎక్కువ.

**హద్దులు (Limitations):**

1. విస్తరణాధికారులు ఎక్కువకాలం గ్రామంలో గడపవలసిన అవసరముంటుంది.
2. గ్రామంలో అమలుచేయవలసిన పనుల గూర్చి చర్చించడానికి ఎక్కువ కాలం కావలెను కాబట్టి ప్రతి రోజూ గ్రామస్థులు, విస్తరణకార్యకర్తలు కలుసుకునే అవకాశం తక్కువ.
3. ధనవ్యయం అధికం.
4. విస్తరణ కార్యకర్తలు గ్రామానికి వచ్చినప్పుడల్లా కొంతమంది గ్రామస్థులను మాత్రమే కలవడానికి వీలవుతుంది. మిగిలిన వారిని అలక్ష్యం చేసినట్లవుతుంది. అందువలన అమలుచేయాలను కార్యక్రమానికి అందరి తోడ్పాటు లభించదు.

**బి) గ్రామస్థులు, విస్తరణ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలలో కలుసుకోవడం (Office calls):**

**ఉపయోగాలు (Uses):**

1. గ్రామస్థులు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినపుడు అనేక విషయాల గురించి నేర్చుకోవాలని కోరిక ఏర్పడుతుంది.
2. గ్రామస్థులే కార్యాలయాలకు రావడం వల్ల కార్యకర్తల సమయం వృధాకాదు.
3. విస్తరణ కార్యక్రమంలో గ్రామస్థుల శ్రద్ధను తెలుసుకోవడానికి అవకాశముంటుంది.

**హద్దులు (Limitations):**

1. విస్తరణ కార్యకర్తలు అన్నివేళలా కార్యాలయాలలో అందుబాటులో లేకపోవచ్చు.
2. గ్రామస్థులు కార్యకర్తల నుండి సేకరించిన సమాధానంతో తృప్తి పొందలేక పోవచ్చు.
3. కార్యాలయాలలో చెప్పబడిన విషయాలను నిత్యజీవన విధానంలో అమలుచేయలేకపోవచ్చు.

**సి) వ్యక్తిగతమైన ఉత్తరాలు (Personal letters):**

**ఉపయోగాలు (Uses):**

1. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం కోసం, లేదా సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ విస్తరణ కార్యకర్తల వద్ద నుంచి ఉత్తరాల ద్వారా సలహాలను పొందడం.
2. విస్తరణ కార్యక్రమంలో వ్యవసాయదారుని సహాయం పొందడం.

**వ్యక్తిగతమైన ఉత్తరాలు వ్రాసేటప్పుడు అనుసరించవలసిన అంశాలు :**

1. ఉత్తరానికి ప్రత్యుత్తరం అడిగినపుడు వెంటనే వ్రాయాలి. వ్యవసాయదారునికి ఏర్పడిన కష్టానికి తగు సలహాలు సమయానికి అందకపోతే వ్యవసాయ దారునిలో ఉత్సాహం నశిస్తుంది.
2. ఉత్తరాలలో ఈ క్రింది విషయాలు వివరంగా వుండాలి.

ఎ) అడిగిన విషయాలన్నిటికి తగిన విధంగా జవాబు వ్రాయాలి.

బి) బాగా అర్థమయ్యేటట్లు సాధ్యమైనంత క్లుప్తంగా జవాబు వ్రాయాలి.

సి) గౌరవప్రదంగా జవాబు వ్రాయాలి.

డి) వాస్తవ విషయాలను వ్రాయాలి.

ఇ) చదవడానికి వీలగువ్రాతలో వ్రాయాలి.

**డి) నిరూపణ ప్రయోగాలు (Result demonstrations):**

**ఉపయోగాలు (Uses):**

1. క్రొత్తపద్ధతులను ప్రత్యక్షంగా చూసినేర్చుకోవచ్చు.
2. వాస్తవ విషయాలను తెలియపరచడానికి ఉపయోగపడుతుంది.
3. కొత్త పద్ధతి వలన లాభాలున్నపుడు పద్ధతి త్వరిత గతిన విస్తరిస్తుంది.

**హద్దులు (Limitations):**

1. ఎక్కువకాలం పడుతుంది.
2. ఎక్కువ వ్యయంతో కూడుకున్నపని.
3. కొత్తపద్ధతి ప్రవేశపెట్టబడినపుడు ఆ పద్ధతిలో లాభనష్టాల గురించి విస్తరణ కార్యకర్తకు అవగాహన వుండాలి.
4. నిరూపణ ప్రయోగం విఫలమైనచో అది విస్తరణ పట్ల గౌరవాన్ని తగ్గించవచ్చు మరియు నమ్మకాన్ని కోల్పోవచ్చు.

**2. సాముదాయక పద్ధతులు (Group methods):**

**ఉపయోగాలు :**

1. ఏ అంశం మీదనైనా చర్చ జరగాలంటే ఈ పద్ధతి మంచిది.
2. సమావేశమైన ప్రతివ్యక్తి తనకు తోచిన సలహాల నివ్వడంలో సంతోషం పొందుతారు.
3. సమావేశాలలో చురుకైన వ్యక్తులను గుర్తించి నాయకత్వ బాధ్యతలను అప్పగించవచ్చు.

4. గ్రామప్రజలలో మార్పును కలుగజేయవచ్చు.

**హద్దులు (Limitations):**

1. గ్రామంలో రాజకీయ స్పర్ధలున్నపుడు కార్యక్రమాలు సజావుగా జరుగవు.
2. ప్రజల మధ్య విరోధాలకు అవకాశముంది.

**ఎ) సాధారణ సమావేశాలు (General meetings):**

**ఉపయోగాలు (Uses):**

1. స్వల్పకాలంలో ఎక్కువ మందిలో మార్పు కలిగించవచ్చు.
2. అన్ని రకాల విషయాలను చర్చించవచ్చు.
3. సాముదాయక కార్యక్రమాలు కనుక కలిసి పనిచేయడానికి ఉత్సాహం కలిగిస్తాయి.
4. విస్తరణ కార్యకర్తలకు, గ్రామస్థులకు మధ్యస్నేహాన్ని అభివృద్ధి పరుస్తాయి.
5. వివిధ రకాల విస్తరణ పద్ధతులను ప్రవేశపెట్టడానికి వీలు కలుగుతుంది.
6. ఆశించిన మార్పులు తక్కువ ఖర్చుతో సాధించవచ్చు.

**హద్దులు (Limitations):**

1. సమావేశానికి కావలసిన ప్రదేశము, సదుపాయాలు అన్ని సమయాలలో దొరకడం కష్టం.
2. గ్రామస్థులలో గల విబేధాల వలన బోధనలకు ఆటంకం కలుగవచ్చు.
3. వాతావరణ పరిస్థితులు, ఇతర ఆకర్షణలు కొన్ని సమయాలలో సమావేశాలకు ఆటంకాలుగా మారవచ్చు.
4. విస్తరణ కార్యకర్త రాత్రి సమయాలలో కూడ పనిచేయవలసి వుంటుంది.
5. సమావేశాలు జరుపునపుడు ఎటువంటి కష్ట నష్టాలు జరుగకుండా జాగ్రత్తలు వహించాలి.

**బి) ప్రత్యక్ష ప్రదర్శన (Method demonstration):**

**ఉపయోగాలు (Advantages):**

1. గ్రామస్థులకు బోధించడానికి ఉపయోగపడే మంచి విస్తరణ పద్ధతి.
2. చూడడం, వినడం, చేయడం వల్ల శ్రోతలలో ఉత్సాహం కలిగి ఆ పద్ధతులనవలంభించడానికి ఇష్టపడతారు.
3. విస్తరణ కార్యకర్తలు నేర్పుతో ప్రదర్శనలు చేసినపుడు ఆ పద్ధతులపై నమ్మకము ఏర్పడి ఆ పద్ధతి అమలు చేస్తారు.
4. చాలా తక్కువ ఖర్చుతో పాత పద్ధతులను మార్చవచ్చు.

**హద్దులు (Limitations):**

1. కౌశల్యాన్ని ప్రదర్శింపజేయడానికే ఉపయోగపడతాయి.
2. విస్తరణ కార్యకర్తలకు ప్రత్యక్ష ప్రదర్శనకు కావలసిన విషయ సామాగ్రిని తయారు చేసుకోవడానికే చాలాసమయం పడుతుంది.
3. ప్రదర్శనా స్థలానికి వస్తువులు, సాధనలు చేరవేయడం కష్టంతో కూడుకున్నపని.

**సి) ఉపన్యాసాలు (Lectures):**

**ఉపయోగాలు :**

1. పెద్ద పెద్ద సమూహాలకు ఈ బోధనా పద్ధతి ఉపయోగకరం.
2. నిర్ణీత కాలవ్యవధికి తగ్గట్టు పాఠ్యాంశం రూపొందించుకుని ముగించవచ్చు.
3. నిర్దిష్టమైన విషయాలు తెలియపర్చవచ్చు.
4. ఇతర బోధనా పద్ధతులను కూడ ఈ పద్ధతిలో చేర్చి ఉపయోగించవచ్చు.

**హద్దులు (Limitations):**

1. విద్యార్థులు / గ్రామస్థుల కౌశల్యాభివృద్ధికి తోడ్పడదు.
2. పరీక్షలు నిర్వహించక పోతే బోధనా ఫలితం తెలియదు.
3. సమస్యాపరిష్కారానికి దోహదపడదు.
4. వ్యక్తి గతంగా, ప్రత్యక్షంగా చేసిచూసుకునే అవకాశం వుండదు.

**డి) సాముదాయక చర్చలు (Group discussions):**

**ఉపయోగాలు :**

1. ప్రతి సభ్యునకు వాని భావాలను తెలియజేసే హక్కువుంది.
2. సాముదాయక చర్చలలో వచ్చిన ఫలితాలను ప్రయోగాత్మకంగా ఉపయోగించుటకు పనికి వస్తాయి.
3. సభ్యులలో ఉత్సాహం ఎక్కువ అవుతుంది.
4. సభ్యులందరి అభిప్రాయాలను క్రోడీకరించగా వచ్చిన ఫలితాలకు ఎక్కువ విలువ కలిగి వుంటాయి.
5. సమస్యలకు పరిష్కార మార్గాలను నిర్ణయించుకోవచ్చు.
6. సాముదాయక చర్చలలో పాల్గొన్న కొంతమంది సభ్యులతో కార్యాచరణ కమిటీగా ఏర్పరిచి వారి ద్వారా ఫలితాలనుఆచరణలో పెట్టవచ్చు.
7. ఇది ఒక శాస్త్రీయమైన పద్ధతి.
8. ఇందులో పాల్గొన్న సభ్యులు మంచి ఉపన్యాసకులు కానక్కరలేదు.

**హద్దులు :**

1. గ్రామంలో విభేదాల వలన ఈ పద్ధతికి అవకాశాలు తక్కువ.
2. క్రమశిక్షణ, మంచిభావాలు కలిగి చర్చించే వారు బహుతక్కువ.
3. సాముదాయక చర్చలకు సభాధ్యక్షుడు దొరకడం కష్టం.
4. సభ్యులకు తెలియని చర్చనీయాంశమైతే చర్చించిన దానికి తగిన ఫలితాలురావు.
5. మంచి ఫలితాలకు సమూహంలో సభ్యుల సంఖ్య తక్కువగా వుండాలి.
6. సమస్యాకారకాలు తెలుసుకోవడానికి ఇది మంచి పద్ధతి కాదు.
7. చాలా నిదానమైన పద్ధతి. అత్యవసర సమయాలలో నిర్ణయాలు తీసుకొనుటకు వీలుకాదు.
8. సాముదాయకచర్చ ఇష్టాగోష్టి (Informal) గా జరుగుతుంది గనుక సమగ్రంగా చర్చించలేము మరియు భావప్రకటనలకు అవకాశాలు తక్కువ.

### ఇ) విజ్ఞానయాత్రలు (Field trips):

**ఉపయోగాలు :**

1. ప్రజలలో ప్రేరణ కలిగించి ఉత్సాహవంతులను చేస్తాయి.
2. విజ్ఞానయాత్రలో పాల్గొనే వారు సహకారంతో చురుకుగా పనిచేస్తారు.
3. విస్తరణ కార్యకర్తలకు, సభ్యులకు మధ్య మంచి బాంధవ్యం ఏర్పడుతుంది.
4. సభ్యుల పరిశీలనాశక్తి అధికమవుతుంది.
5. సభ్యులలో నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయి.
6. వివిధ ప్రదేశాలను సందర్శించడం వల్ల అనేక విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

**హద్దులు :**

1. చాలా వ్యయంతో కూడుకున్న పని.
2. అందరికి అనువైన కాలం నిర్ణయించడం కష్టం.
3. యాత్రా స్థలాల్లో అనువైన వసతులు దొరకక పోవచ్చు.
4. యాత్రలో తగు సదుపాయాలు లోపిస్తే నిరుత్సాహం కలుగుతుంది.
5. నేర్చుకోవలసిన విషయాలపై ఆశక్తి చూపక ఇతర విషయాలలో ఆసక్తి ఏర్పడితే ఆ యాత్రకు విలువ వుండదు.

### 3. సామూహిక పద్ధతులు (Mass methods):

**ఉపయోగాలు :**

1. పెద్ద సమూహాలకు ఒకేసారి సమాచారం అందించవచ్చు.
2. సావకాశంగా చదువుకుని, అవసరమైనపుడు మళ్లీ మళ్లీ చూసుకోవడానికి వీలవుతుంది.
3. సాధారణంగా అచ్చువేసిన వాటిపై ప్రజలకు నమ్మకం కుదురుతుంది.
4. ఇతర బోధనా పద్ధతులతో వీటిని జతపరచవచ్చు.
5. అందజేయబడే సమాచారాన్ని బాగా సమకూర్చి అందుబాటులోనికి తేవచ్చు.
6. తక్కువ ఖర్చుతో వాస్తవ జీవితంలో ఉపయోగపడతాయి.
7. వ్యక్తుల లేదా సమూహాల శక్తిని ప్రదర్శించడానికి వీలుకలుగుతుంది.

**హద్దులు :**

1. నిరక్షరాస్యులకు చదివి అర్థంచేసుకునే అవకాశం లేదు.
2. నవీన పద్ధతులలో మార్పులు జరిగినప్పుడు ప్రతీసారీ సమాచారాన్ని అందించడానికి ధనవ్యయం అధికం.
3. అందరికీ అందజేయడానికి తయారు చేయబడిన విషయాలు స్థానిక పరిస్థితులకు ఉపయోగపడకపోవచ్చు.
4. వ్యక్తి గతంగా ప్రజలను కలుసుకుని చర్చించడానికి అవకాశముండదు. ఆ విధంగా వీటి విలువ చాలా తక్కువ.

# అధ్యాయము - 5

## వ్యవసాయ సమాచార ప్రచురణలు (Agricultural information Materials)

* వ్యవసాయ సమాచార ప్రచురణల ముఖ్యోద్దేశము ప్రజలకు సమాచారం అందజేయడం.
* వ్యవసాయదారులు సాధారణంగా విద్యావంతులు కాకపోవడం వల్ల సమాచార ప్రచురణలు సులభంగా అర్థమయ్యేటట్లు ఉండాలి.
* సాంకేతిక పరిజ్ఞానంలో సాధారణంగా శాస్త్రీయ విషయాలుండడం వల్ల సాధ్యమైనంత వరకు వాడుకభాషలో వ్రాసిన ఎడల సులభంగా అర్థం చేసుకోగలరు.

**ప్రచురించుటలో పాటించవలసిన నియమాలు :**

* అవసరమైన సమాచారాన్నే సేకరించి ప్రచురించాలి.
* బోధనాంశము మన అవసరాలకు తగ్గట్లుగ వుండాలి.
* సమాచార పత్రములోని విషయాలు ఆసక్తికరంగా వుండాలి. మరియు మన జీవితంలో ఉపయోగపడేటట్లుగా వుండాలి.

**1. శ్రోతలు (Audience):**

* అభ్యసించేవారు అక్షరాస్యులా, నిరక్షరాస్యులా - వారి సమస్యలు, సమస్యాపరిష్కారాలు క్షుణ్ణంగా తెలుసుకు ప్రచురణలు తయారు చేయాలి.
* వ్యవసాయదారులలో వివిధ వయస్సులవారు, వివిధ స్వభావాలు కల్గిన వారుంటారు. ప్రచురణలు వారికి తగ్గవిధంగా తయారు చేయాలి.
* వ్యవసాయ దారులు కష్టజీవులు -పొలంపనిచేసుకుని వచ్చిన తర్వాత ముద్రించిన సమాచారాన్ని చదవడానికి ఇష్టపడరు. సాధారణంగా చదువుకున్నవారు లేదా గ్రామపెద్దలు లేదా ఉపాధ్యాయుల వద్ద నుండి సమాచారాన్ని అడిగి తెలుసుకుంటారు.

**2. ధర (Cost):**

* సమాచార ప్రచురణలు సరసమైన ధరలో అందించాలి. దీని కొరకు ఎక్కువ ప్రతుల ముద్రణ, కాగితం ఎంపిక, కాగిత పరిమాణము ప్రచురణ ధరను దృష్టిలో వుంచుకోవాలి.

**3. సమాచార వివరణ :**

* ప్రచురించిన సమాచారం చాల సులభశైలిలో వుండాలి. ఎక్కువ సమాచారమున్నపుడు "లీఫ్ లెట్" లేదా "ఫోల్డరు" పై ముద్రించవచ్చు. సమాచారము చక్కని వివరణతో ఉండాలి.

**4. ప్రచురణ పద్ధతులు మరియు వాటికి కావలసిన వస్తువులపై అవగాహన (Familiarity with methods and materials):**

* విస్తరణ సమాచారము అనేక పద్ధతులలో అనేక వస్తువుల మీద ముద్రించవచ్చు. కనుక విస్తరణాధికారికి వీటిపై అవగాహన కలిగి వుండాలి.
* ప్రస్తుత ధరలు, ప్రచురణకు ఉపయోగించే వస్తువులను ఆదాచేయ గల పద్ధతుల గురించి తెలిసివుండాలి.

**5. వస్తువుల అందుబాటు (Availability of material):**

* కాగితం ధర ప్రచురణ ఖర్చులో 60-70% మాత్రమే వుండాలి.

* ప్రచురణ ఖర్చులో ముద్రణ ఖర్చు 12-20% ఉంటుంది.

**ప్రచురణల వల్ల ఉపయోగాలు :**

1. పెద్ద సమూహాలకు ఒకేసారి సమాచారాన్ని అందజేయవచ్చు.
2. సావకాశంగా చదువుకుని, మరల అవసరమైనపుడు చూసుకోవడానికి వీలవుతుంది.
3. సాధారణంగా అచ్చువేసిన వాటి మీద ప్రజలకు నమ్మకం కుదురుతుంది.
4. ఇతర బోధనా పద్ధతులతో వీటిని జతపరచవచ్చు.
5. అందజేసే సమాచారము బాగా సమకూర్చి కావలసిన అంశానికి తగినట్లుగా ఉండి ఏ సమయంలో నైనా అందుబాటులో ఉంటుంది.
6. ఇవి తక్కువ ఖర్చుతో వాస్తవ జీవితంలో ఉపయోగపడే సూచనలను ఇస్తాయి.
7. నిరక్షరాస్యులలో కుతూహలాన్ని, విద్య అభివృద్ధి అయ్యే అవకాశాలను కూడ కొంత వరకు కలిగిస్తాయి.

**హద్దులు (Limitations):**

1. నిరక్షరాస్యులకు ఇది చదివి అర్థం చేసుకునే అవకాశం లేదు.
2. నూతన పరిశోధనా పద్ధతులను తెలియపరచాలంటే పాత ప్రచురణలను మార్చడానికి ఖర్చు ఎక్కువవుతుంది.
3. కొన్ని ప్రచురణలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వుండకపోవచ్చు.
4. వ్యక్తిగతంగా ప్రజలను కలిసే అవకాశం వుండదు.

**వ్యవసాయ సమాచార ప్రచురణలు - రకములు :**

**1) లీఫ్‌లెట్ (Leaflet):**

* లీఫ్‌లెట్ సాధారణంగా కాగితం ఒక వైపు మాత్రమే ముద్రించబడి ఉంటుంది. కొన్ని సందర్భాలలో మాత్రమే మడచబడి వుంటుంది. ఒక విషయానికి సంబంధించిన ప్రత్యేక సమాచారాన్ని మాత్రమే వుంటుంది. వ్యవసాయా దారుల తక్షణ అవసరాలకు మాత్రమే పనికివస్తుంది.

**2) మడత పత్రాలు (Folders):**

* మడత పత్రము అనునది ఒక కాగితంపై సమాచారాన్ని కలిగి వుంటుంది. ఇది 1 లేదా 2 లేదా 3 సార్లు మడచబడి వుంటుంది.
* దీనిని సాధారణంగా లావుపాటి కాగితంపై రంగులు మరియు బొమ్మలతో ఆకర్షణీయంగా తయారు చేస్తారు. ఇది ఏవైనా వస్తువిక్రయాలకు, ప్రచారాలకు ఉపయోగపడతాయి.

**3) పాంప్లెట్ (Pamphlet):**

* ఎక్కువ సమాచారం కలిగి, వ్యవసాయదారులకు ఆయా దశలలో అవసరాన్ని బట్టి సమాచారం యివ్వడానికి వుపయోగపడతాయి.

**4) సర్క్యులర్ లెటర్లు (Circular letters):**

* విస్తరణ కార్యక్రమ ప్రచారంలో లేదా ఇతర సమాచారము నందించుటకు ఎక్కువ సంఖ్యలో ప్రజలకు పంపే లేఖ ప్రతులను “సర్క్యులర్ లెటర్లు” అంటారు.

| | |
|---|---|
| సమావేశ ఆహ్వానము<br>విషయాసక్తిని పెంపొందించుటకు<br>కొత్తపద్ధతులు ఆచరింపజేయుటకు<br>ప్రశ్నావళినింపుటకు<br>పురుగులు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టుటకు | సర్క్యులర్ లెటర్స్ వాడుతారు. |

**ప్రయోజనాలు (Advantages):**

1. సమాచారం సరైన సమయంలో చేరవేస్తుంది.
2. ప్రజల హాజరు శాతాన్ని పెంచడానికి సహకరిస్తాయి.
3. ప్రత్యక్ష విజ్ఞప్తి చేయడానికి అవకాశం కల్పిస్తాయి.
4. రచయిత వ్రాసిన లేఖను బట్టి పాఠకునిపై ప్రభావితం ఉంటుంది.

**5) బులిటెన్ (Bulletin):**

* ఎక్కువ సమాచారం కలిగి సుమారు 20 పేజీలపైన వుండవచ్చు.
* పాఠకునికి స్థానిక పరిస్థితులపై సమాచారాన్ని అందించడమే ముఖ్యోద్దేశము.

**6) వార్తా కథనాలు (News stories):**

* ప్రజలకు సరైన సమయంలో, ఆసక్తి కలిగించే సమాచారాన్ని అందించేవి "వార్తలు" అంటారు.
* ఎక్కువ మంది ఈ సమాచారానికి ఆకర్షితులైతే "అత్యుత్తమ వార్త" లంటారు.
* వాస్తవాలను పక్షపాతం లేకుండా పాఠకులలో ఆసక్తిని కలిగించేది - వార్తాపత్రిక.

**లక్ష్యాలు :**

1. ఆసక్తిని పెంపొందిస్తుంది.
2. సామాన్య ప్రజానీకానికి సమాచారం ఇచ్చుటకు.
3. ప్రపంచంలో పలుచోట్ల ఆసక్తి కలిగించే విషయాలను అందిస్తుంది.
4. సమావేశాలు, ప్రదర్శనల వంటి విస్తరణ పద్ధతులకు బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది.

**ప్రయోజనాలు :**

1. తక్కువ ఖర్చు . తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని అందించవచ్చు.
2. సరైన సమయంలో సమాచారాన్ని అందించడానికి తోడ్పడే సాధనం.
3. ప్రజాసంబంధాలు మెరుగుపరచడంలో తోడ్పడుతుంది.

**హద్దులు :**

1. నిరక్షరాస్యులకు ఇది నిరుపయోగం.
2. ఫలితాలను బేరీజు వేసుకోవడం కష్టం.
3. మంచి కథనాలు, వ్యాఖ్యలు, వ్రాయడానికి ప్రత్యేక శిక్షణ అవసరం.

**7) వాల్ న్యూస్ పేపరు (Wall News paper):**

* ఒక వైపు మాత్రమే ముద్రించబడి గోడల మీద ప్రదర్శింప బడుతుంది.
* వీటిని నలుగురు ఎక్కువగా తిరిగే కూడళ్లలో అతికించడం వల్ల చాలా మందికి తక్కువ సమయంలో విషయాలు తెలుస్తాయి.

# అధ్యాయము - 6
# బోధనోపకరణములు

## (Instructional/Teaching aids)

**బోధనోపకరణములు - లాభాలు :**

విద్యార్థులకు / గ్రామస్థులకు బోధన చేయునపుడు వారి నైపుణ్యం, అవగాహన, పెంచడానికి వాడబడే పరికరాలను "బోధనోపకరణములు" అందురు.

1. మెరుగ్గా మరియు ప్రభావవంతంగా బోధించుటకు.
2. శ్రోతలు చూచి, విని నేర్చుకోవడానికి వీలు కల్గుతుంది.
3. బోధనోపకరణాల ద్వారా బోధించడం వల్ల శ్రోతలలో ఆసక్తి పెరుగుతుంది.
4. బోధనాంశాన్ని త్వరితంగా చెప్పడానికి
5. చూసి, విని నేర్చుకున్న పాఠ్యాంశము త్వరితంగా శ్రోతలు అర్థం చేసుకుంటారు.
6. విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది.
7. పాఠ్యాంశాలకు బోధన పరికరాలనుపయోగించడం వల్ల కొత్తదనం చేకూరుతుంది.
8. బోధనోపకరణములవల్ల పాఠ్యాంశము చూడడం, వినడం, జ్ఞానేంద్రియాలు (కన్ను, చెవి, మనస్సు) కేంద్రీకృత మవడం వల్ల శ్రోతకు పాఠ్యాంశము వేగంగా అర్థమవుతుంది.
9. తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి విద్యను అందించవచ్చు.
10. ఈ అభ్యసనా విధానం వల్ల విద్యార్థి పాఠ్యాంశంపై స్పష్టమైన, ఖచ్చితమైన మరియు సవివరమైన అభిప్రాయం ఏర్పరచుకుంటారు.
11. సందర్భానుసారంగా పాఠ్యాంశమును మార్చుకోవచ్చు.
12. బోధనోపకరణాల వల్ల - అభ్యసించడంతో బాటు, శిక్షణకూడ పొందడం జరుగుతుంది.
13. క్రమశిక్షణ వాతావరణం కలుగుతుంది.
14. ఆలోచనలను ప్రేరేపిస్తుంది.
15. ప్రపంచలో జరిగే విషయాలను ప్రత్యక్షముగా చూపించి వాటిపై వివరణ యివ్వడానికి వీలుకలుగుతుంది.
16. కాలాన్ని, డబ్బును ఆదా చేయవచ్చు.

**వర్గీకరణ (Classification):**

1. శ్రవణ పరికరాలు (Audio aids)
2. దృశ్య పరికరాలు (Visual aids)
3. శ్రవణ దృశ్య పరికరాలు (Audio-Visual aids)

**1. శ్రవణ పరికరాలు (Audio aids):**

* విని నేర్చుకోవడానికి మాత్రమే తోడ్పడతాయి, చూడడానికి వీలుపడవు.

ఉదా : రేడియో, రికార్డు ప్లేయరం, టేప్ రికార్డర్.

**2. దృశ్య పరికరాలు :**

* చూసి నేర్చుకోవడానికి మాత్రమే తోడ్పడతాయి. వీటి వలన వినడానికి వీలులేదు.

**దృశ్య పరికరాలలో రకాలు :**

**ఎ) తెరపైన చూడలేనివి (Non-projected):**

ఉదా : మోడల్స్, స్పెసిమన్, ఫానెల్‌గ్రాఫ్, ఫ్లాష్‌కార్డు, ఫోటో గ్రాఫులు, చార్ట్‌లు, పోస్టర్లు, బులెటిన్ బోర్డు.

**బి) తెరపైన చూప గలిగేవి (Projected):**

ఉదా : Slides, Silent films, Film strips,

ఎపిడియాస్కోప్, ఒపేక్ ప్రాజెక్టర్ (ఓవర్ హెడ్ ప్రాజెక్టర్).

**సి) ఇతరములు (Others):**

ఉదా : ప్రదర్శనలు (Exhibits), నిరూపణ ప్రయోగాలు (demonstrations), రచనలు (Literatur)

**3. శ్రవణ దృశ్య పరికరాలు (Audio-Visual aids):**

* ఇవి చూసి విని నేర్చుకోవడానికి మంచి అవకాశాన్నిస్తాయి.
* ఈ విధంగా నేర్చుకోవడం అన్నిటి కన్నా ఉత్తమమైనది.

**శ్రవణ దృశ్య పరికరాలలో రకాలు :**


ఎ) బహిరంగ ప్రదర్శనకు ఉపయోగపడునవి (Display type)

ఉదా : పోస్టర్లు, మోడల్స్, బులిటెన్ బోర్డులు

బి) సమర్పణ విధానమునకు ఉపయోగపడునవి (Presentation type)

ఉదా : ఫ్లాస్‌కార్డులు, స్లైడ్‌లు మొదలగునవి

డా॥ ఎడ్గర్‌డేల్ శ్రవణ, దృశ్య పరికరాలను క్రింది పటంలో చూపిన విధంగా ఒక శంకువు ఆకారంలో అమర్చి దానిని "అనుభవాల శంఖువు" (The cone of experience) అని అన్నారు.




అనుభవాల శంఖు
(The cone of experience)

* శ్రవణ, దృశ్య పరికరాల పరస్పర సంబంధాన్ని, అభ్యసించే పద్ధతిలో వాటికి గల ప్రత్యేక స్థానాన్ని క్రమపద్ధతిలో తెలియపరచడానికి ఈ శంకువు ఏర్పరిచారు.
* ఈ శంకువులో క్రింది నుంచి పై వరకు concrete అనుభవాలు, Abstract అనుభవాలు ఉన్నాయి. కాబట్టి వీటి సహాయంతో నేర్చిన విద్య విజయవంతమవుతుంది.
* ఏ విషయాన్నైనా వినడం వల్ల గాని, చూడడం వల్ల గాని మాత్రమే నేర్చుకోలేము, కాని వినవలసిన విధంగా విని, చేయవలసిన విధంగా చేయడం వల్లనే విజ్ఞానాభివృద్ధి జరుగుతుంది.
* శ్రవణ దృశ్య పరికరాలు అమూల్యమైనవి. ఏ విషయాన్నైనా క్షుణ్ణంగా నేర్చుకునే వారికి క్రింద చూపబడిన నాలుగు విధాలుగా తోడ్పడతాయి.
    1. అనేక విషయాలు నేర్చుకోవడానికి
    2. అతి త్వరగా నేర్చుకోవడానికి
    3. నేర్చుకొన్న విషయాలు చాలాకాలం జ్ఞాపకం ఉంచుకోవడానికి
    4. పరిపూర్ణంగా నేర్చుకోవడానికి

## అధ్యాయము - 7

## భారతదేశంలో గ్రామీణ మరియు పట్టణ సమాజాలు (Characteristics of Indian Rural Society)

**భారతగ్రామీణ స్వరూపము :**

* భారతదేశంలో గ్రామం ఒక విశిష్ట స్థానం కలిగి వుంది.
* గాంధీమహాత్ముడు గ్రామాభివృద్ధి అంటే దేశాభివృద్ధే అని వక్కాణించిచెప్పారు. అంటే మనదేశము "గ్రామీణభారతము".
* గ్రామప్రజలు కుల, సమాజ ఆచారాలకు లోబడి కలిసి మెలసి జీవిస్తారు..
* గ్రామీణ సమాజంలో కులప్రాధాన్యత ఉంటుంది. దీనివల్ల గ్రామీణుల మధ్య సామాజిక, ఆర్థిక విలువల తేడాలు కనిపిస్తాయి.
* గ్రామీణులలో అనేక కులవృత్తులు కలవారుంటారు. గాంధీ మహాత్ముడు కులవృత్తులకు ప్రాధాన్యత యిచ్చారు. కులవృత్తులు మన గలిగినపుడే గ్రామాభివృద్ధి - దానితో బాటు దేశాభివృద్ధి ముడి పడి వుంటాయని చెప్పారు.
* గ్రామాలలో కట్టుబాట్లకు ప్రాధాన్యత యిస్తారు.
* భారతదేశ గ్రామాలలో సమస్యలన్నీ ఒకే రకంగా వుంటాయి.
* గ్రామప్రజలలో అనేక మత, కులముల వారుండవచ్చు. అట్టి పరిస్థితులలో భాషలు వారి కట్టుబాట్లు వివిధ రకాలుగా వుంటాయి.
* చిన్న గ్రామాలలో ఒకే కులము వారు నివసించుచుంటారు. ఉదా : అగ్రహారము (బ్రాహ్మణులు), హరిజన వాడలు.
* గ్రామాలలో సాధారణము పురుషుల ఆధిక్యత స్త్రీలపై వుంటుంది.
* గ్రామీణభారతం ముఖ్యమైన వృత్తి "వ్యవసాయము" భూమి కలిగివున్న గ్రామీణుల సమాజంలో గౌరవము ఎక్కువ. అంతేకాక వారికి ఆర్థికబలమెక్కువ. సాధారణంగా కొన్ని కులాల వారు, లేదా కుటుంబాల వారికే అధిక భూవిస్తీరాలుకలిగి "భూస్వాములు"అధికారం చేపడతారు.

* స్వాతంత్ర అనంతరం గ్రామీణ పరిపాలన వ్యవస్థను "పంచాయతీరాజ్" వ్యవస్థగా చట్టరూపంలోనికి తీసుకువచ్చారు.
* ఆధునిక రవాణా, సమాచార అందుబాటులు గ్రామస్వరూపాన్నే మార్చివేస్తాయి.
* గ్రామ తగాదా పరిష్కారాలు ఆగ్రామ పాత ఆచారాల ప్రకారం జరుపబడతాయి.
* కొన్ని గ్రామాల ప్రజలు ఉదారస్వభావం, నీతినియమాలతో వ్యవహరిస్తే, మరి కొన్ని గ్రామాలలో నిరాదరణ, అవినీతిని కలిగి వుంటాయి.
* కొన్ని గ్రామాలలో ప్రజలు సహకార భావం కలిగి గ్రామాభివృద్ధికి తోడ్పడుతుంటే కొన్ని గ్రామాలలో గ్రామకక్ష్యలతో గ్రామాలు ఛిన్నాభిన్నమై పోతున్నాయి.

**గ్రామీణ మరియు పట్టణ సమాజాల మధ్య వ్యత్యాసాలు**

**(Differences between Rural and Urban community):**

| గ్రామీణ సమాజము | పట్టణ సమాజము |
|---|---|
| 1. ప్రజల జీవన విధానం ప్రకృతితో ముడిపడి వుంటుంది. | 1. ప్రజల జీవనవిధానం కృత్రిమంగా ప్రకృతికి దూరంగా వుంటుంది. |
| 2. జనసాంద్రత తక్కువ. | 2. జనసాంద్రత ఎక్కువ. |
| 3. ప్రజల మానసిక లక్షణాలు సుమారుగా ఏకరూపత కలిగి వుంటారు. | 3. ప్రజలలో భిన్నత్వం ఎక్కువగా వుంటుంది. |
| 4. దైవసంబంధమైన సంస్కృతి ఎక్కువ. | 4. లౌకిక సంబంధ సంస్కృతి ఎక్కువ. |
| 5. ప్రాధమిక సంబంధాల ప్రాముఖ్యత ఎక్కువ సాంఘిక సంబంధాలు తక్కువ ధృడమైన బంధుత్వ సంబంధాలు చాలా కాలం నిలుస్తాయి. | 5. ప్రాధమిక సంబంధాల ప్రాముఖ్యత తక్కువ సాంఘిక సంబంధాలు ఎక్కువ బంధుత్వాలు వ్యక్తిగతం కావు. స్వల్పకాలం నిలుస్తాయి. |
| 6. గ్రామీణులలో నిరాడంబరత, వినయ విధేయతలు కలిగి వుంటారు. | 6. నిరాడంబరత, వినయవిదేయతలు చాలా తక్కువ. |
| 7. గ్రామీణ సాంఘిక విధానం నుండి సంస్థలు తయారవుతాయి. | 7. చట్టబద్దమైన సంస్థలు ఎక్కువగా వుంటాయి. |
| 8. ఐక్యతాభావం ఎక్కువ. | 8. ఐక్యతాభావం తక్కువ. |
| 9. సమాజం సరళమైనది. | 9. సమాజం సంక్లిష్టమైనది. |
| 10. వ్యవసాయం ప్రధాన జవనాధారం వ్యవసాయ దారులకు నెల వారీ జీతాలు వుండవు. వాని కష్టం మీద వ్యవసాయంలో లాభనష్టాలతో జీవనం గడుపుతారు. | 10. పారిశ్రామిక, సాంకేతికతలపై ముఖ్య జీవనాధారం ఆధారపడి వుంటుంది. నెలజీతాలపై ఆధారపడతారు. |
| 11. గ్రామజనాభా తక్కువగా వుంటుంది. వారిలో అధికంగా వ్యవసాయదారులే వుంటారు. | 11. పట్టణాలలో జనాభా అధికంగా వుంటుంది. వారిలో పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలలో పనిచేసే వారు, ప్రభుత్వోగులు ఎక్కువగా ఉంటారు. |

| | |
|---|---|
| 12. గ్రామప్రాంతాలలో వారికి కావలసిన ఆహారం, వసతి, బట్టలు కొంత వరకూ వారే చేసుకుంటారు. | 12. పట్టణప్రజలు ఆహారము కొరకు పల్లెప్రాంతాలపై ఆధార పడతారు. |
| 13. సాంఘిక విభజన తక్కువ కాబట్టి గ్రామంలో తక్కువ కులాల వారుండడం వలన కులతత్వం ఎక్కువ. | 13. సాంఘిక విభజనల ఎక్కువ అనేక జాతుల వారు, మతాలవారు కులాల వారుండడం వల్ల కులతత్వం తక్కువ. |
| 14. వ్యవసాయం ప్రస్తుత పరిస్థితులలో గిట్టుబాటు లేకపోవడం వలన, వ్యవసాయ కూలీలు పట్టణ ప్రాంతాలకు వలసకు పోతారు. | 14. ఉద్యోగావకాశాలు ఎక్కువ గాబట్టి పట్టణ ప్రజలు పల్లెలకు వలసపోరు. ప్రమాదకర సంఘటనలు జరిగినపుడు గ్రామాలకు వలసపోతారు. |
| 15. కొనుగోలు శక్తి తక్కువ. | 15. కొనుగోలు శక్తి ఎక్కువ. |
| 16. గ్రామీణులకు ముఖ్యంగా వ్యవసాయదారులకు ఒక క్రమపద్ధతిలో రాబడి రాదు. పంట అమ్మిన తర్వాత ఖర్చులు పోనూ మిగిలినదే రాబడి. ఆ రాబడి తోనే జీవనం గడపాలి. | 16. వర్తక వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు,ఉద్యోగస్తులు మొదలైన వారికి ప్రతి నెలా క్రమ పద్ధతిలో జీతం రూపంలో డబ్బు అందుతుంది. |
| 17. విద్యావకాశాలు చాలా తక్కువ. | 17. విద్యావకాశాలు ఎక్కువ. |

# అధ్యాయము - 8

## గ్రామీణాభివృద్ధి (Rural Development)

**అర్థం, ఉద్దేశం, సమస్యలు :**

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి నిరంతరంగా చేపట్టవలసిన ప్రక్రియ.
- గ్రామీణాభివృద్ధి అనగా గ్రామప్రజలలో గల శక్తి యుక్తులను వెలికితీయడం, వారికి తెలియజేయడం - అంతేకాక వాటిని అమలుపర్చడం.
- గ్రామంలో చాలా మంది పేద ప్రజలు-వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుపరచి వారి జీవన ప్రమాణాలన పెంచడమే గ్రామీణాభివృద్ధి యొక్క ముఖ్యోద్దేశం.
- ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను పేదగ్రామీణులకు అందజేయడమే “గ్రామీణాభివృద్ధి”.
- స్వాతంత్ర్యమునకు ముందు సేవానిరతిగల గొప్పవ్యక్తులు గ్రామప్రాంతాల అభివృద్ధికి పాటు పడ్డారు. అయితే కొంత వరకు సఫలీకృతులైనా ఆ ఫలితాలు చెదురు ముదురుగా కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యాయి.
- స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత, వివిధ పంచ వర్షప్రణాళికలలో గ్రామాభివృద్ధికి ప్రాముఖ్యత నిచ్చారు.
- గ్రామాభివృద్ధిలో ముఖ్యంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలకు ప్రాధాన్యం యివ్వాలి.

**గ్రామీణాభివృద్ధి - ఉద్దేశ్యాలు (Rural Development – Objectives):**

1. గ్రామప్రజల శ్రామిక శక్తిని ఆర్థికాభివృద్ధి కొరకు ఒక్క త్రాటిపైకి తేవడం.
2. గ్రామీణ ప్రజల సృజనాత్మక శక్తిని వెలికితీసి వారి అభివృద్ధికి దోహద పడేటట్లు చేయడం.
3. పల్లెలను సర్వతోముఖాభివృద్ధి జరిగేటట్లు లభ్యమయ్యే మానవ వనరులను వినియోగించుకోవాలి.

4. పల్లెలలో గాంధీమహాత్ముని కోరిక మేరకు కుటీర పరిశ్రమలు నెలకొల్పి గ్రామీణుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడినట్లయితే గ్రామీణ యువతపట్టణాలకు వలసలు తగ్గుతాయి. కుటీర పరిశ్రమలు భారతీయ సంస్కృతికి పునాదులు. వీటిని విస్మరించరాదు.

   ఉదా : చేనేత పరిశ్రమ.

5. కుటీర పరిశ్రమలు పర్యావరణాన్ని కాపాడుతూ సమతూకంలో ఉండేటట్లు చేస్తాయి.
6. అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామీణ స్త్రీలు, యువత ఎక్కువగా పాల్గొనేటట్లు చూడాలి.

**గ్రామీణాభివృద్ధిలో సమస్యలు (Problems of Rural development):**

1. గ్రామీణులలో ఎక్కువ మంది నిరక్షరాస్యులు. విస్తరణ బోధనా పద్ధతులు ఎన్నుకునేటప్పుడు వారిని ఆకట్టుకుని, వారికి అర్థమయ్యేటటువంటివిఎన్నుకోవాలి.
2. విస్తరణాబోధన పద్ధతులు గ్రామాలన్నిటిలో అమలు చేయడానికి విస్తరణ కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో అవసరముంటుంది.
3. సామూహిక ప్రసార సాధనాలు (Mass media) వంటి భావవ్యక్తీకరణ మార్గాలు ఉండవు.
4. వ్యవసాయ దారులు తగ్గిన శిక్షణ యివ్వాలంటే తగినన్ని నిధులను సమకూర్చాలి.
5. సాంప్రదాయ పద్ధతులనాచరించే గ్రామీణ సమాజము ఫలితాలను కళ్లతో చూడనిదే మార్పునకు ఇష్టపడరు.
6. నిరక్షరాస్యులైన గ్రామీణ సమాజం నుండి నిజమైన నాయకత్వాన్ని రాబట్టుట కష్టము.
7. గ్రామీణులకు క్రొత్త విధానములలో బోధించుటకు నైపుణ్యం గల విస్తరణ కార్యకర్తలు అవసరం.
8. పరిస్థితులననుసరించి వ్యక్తుల మరియు సమాజాల అవసరాలు మారుతుంటాయి.
9. వ్యవస్థాపర అడ్డంకులు.
10. వ్యవస్థ లక్ష్యాలు నిర్దిష్టంగా లేవు.

**గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం (Participatory Rural Appraisal) (PRA):**

**అర్థము :**

* గ్రామప్రజల మరియు విస్తరణ కార్యకర్తల మధ్య పరస్పర అవగాహన సమ్మేళనమును గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం (PRA) (express) అంటారు..

**నిర్వచనం :**

* ప్రజల యొక్క వాస్తవ స్థితి గతులను-వ్యక్తీకరించుటకు, విశ్లేషించుటకు (analyse) ఏమిచేయ వలనో నిర్ణయించుటను-మరియువాటివల్ల వచ్చు ఫలితాలను మూల్యాంకనము చేసుకొను అవకాశము ప్రజలకు కల్పించడమే "గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మకతులనము (PRA)" అంటారు.

**PRA ముఖ్య లక్షణాలు (Salient features):**

1. త్రికోణ విధానం (Triangulation)
2. బహుళ విభాగ బృందం (Multi-disciplinary team)
3. పద్ధతుల సమ్మేళనము (Mix of techniques)
4. పరిస్థితులకు అనుగుణంగా మరియు స్నేహపూర్వకంగా వుండుట (Flexibility and informality).
5. సమాజ భాగస్వామ్యం (Involvement of community).
6. కావలసిన సమాచారం మాత్రమే పరిగణనలోనికి తీసుకొనుట.
7. తక్షణ విశ్లేషణ (On the spot analysis).

**1. త్రికోణ విధానము (Triangulation):**

* వివిధ సమయాల్లో వేర్వేరు పద్ధతుల ద్వారా వచ్చిన "డాటా"ను పోల్చుట మరియు సరిచూచుటను "Triangulation" అందురు.గణాంక నమూనాల వలె కాకుండా వివిధ రకాల సమాచారాన్ని వివిధ రకాల కేంద్రాల నుండి సేకరించడం వలన ఖచ్చితత్వం (Accuracy) ను సాధించవచ్చు.
* బృందం యొక్క నిర్మాణం, సమాచార వనరులు, పరికరాలు మరియు పద్ధతుల సమ్మేళనములపై "త్రికోణ విధానం" పని చేస్తుంది.

**2. బహుళ విభాగ బృందం (Multidisciplinary Team):**

* PRA సభ్యులు ఒకరికొకరు సహకరించుకుంటూ విషయాలపై లోతైన మరియు సంపూర్ణ అవగాహన కలిగి వుండాలి.
* అందరు సభ్యులు విషయసేకరణ, వాటి అమరిక మరియు విశ్లేషణలో పాల్గొనాలి.
* PRA సభ్యులలో మహిళలు, అట్టడుగు వర్గాల ప్రజలు ఎక్కువగా ఉండేలా చూచుకోవాలి.
* PRA సభ్యులు వేరొకరినుంచి విషయాలను నేర్చుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది.

**3. పద్ధతుల కలయిక (Mixing of Techniques):**

పరిశీలన
మౌఖిక పరీక్షలు
చర్చలు
చిత్రాలు
} సందర్భాను సారంగా పద్ధతులు ఉపయోగిస్తారు.

**4. పరిస్థితులకు అనుగుణంగా మరియు స్నేహపూర్వకంగా వుండుట :**

ప్రణాళికలు, పరిశోధనా పద్ధతులు PRA క్షేత్ర స్థాయిలో ముందుకు వెళ్లేకొలది పరిస్థితుల కనుగుణంగా మార్పులు చెందుతూ క్రొత్తదనంతో ఉంటాయి.

**5. సమాజభాగ స్వామ్యం :**


* సమాజ సభ్యుల సమస్యలు సభ్యుల కళ్లతోనే చూచునట్లుగా వుండాలి.
* ప్రణాళిక రచన, విశ్లేషణ సమాజ సభ్యులతో కలిసి చేయాలి.
* సమాజ సభ్యులతో సన్నిహిత గలవారు సభ్యుల వివరాలను వివరించుటలో, అర్థం చేసుకొనుటలో మరియు విశ్లేషణలో తోడ్పడుదురు.

**6. కావలసిన సమాచారాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకోవాలి :**


* అసలు ఉద్దేశ్యానికి సంబంధించని అనవసర విషయాలను పరిగణనలోనికి తీసుకోరాదు.
* అవసరం లేకుండా ఎక్కువ సమాచారం సేకరించడం చేయకూడదు.
* ఏ పద్ధతిలోనైనా అక్కడి కక్కడే జరిగే విశ్లేషణపై ఆధారపడి వుంటుంది.

**7. తక్షణ విశ్లేషణ (On the spot analysis):**

* క్షేత్రం (పొలం) లోనే అభ్యసనం జరుగుతుంది.
* విశ్లేషణ కూడ క్షేత్ర స్థాయిలోనే జరగాలి.
* PRAటీమ్ పున:పరిశీలన మరియు విశ్లేషణలపై ఆధారపడి ఏ వైపుకు పురోగమించాలో నిర్ణయించుకుంటుంది.




త్రికోణ విధాన పద్ధతి




**P.R.A టీమ్ తీసుకోవలసిన జాగ్రత్తలు :**

- సమాజప్రజల భాగస్వామ్యం ఎక్కువగా వుండేటట్లు చూచుకోవాలి.
- మనకున్న వనరులు,

  PRA బృంద పరిమాణం మరియు నైపుణ్యం మొదలగు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.
- PRA బృందం మరియు విస్తరణ కార్యకర్తలు కలిసిమెలసి పనిచేసుకోవాలి.
- డాటా తీసుకోవడం, గణాంక శాస్త్ర అధ్యయనంలోనూ, తీసుకునే నిర్ణయాలలోనూ తగినంత విశ్వశనీయత ఉండాలి.
- PRA బృందం పేదవారు, మహిళలకు ఇతర ప్రతికూల పరిస్థితులలో వున్నవారికి పక్షపాతం లేకుండా ప్రాధాన్యత నివ్వాలి.

  రాజకీయ నాయకులు, ధనవంతులు, బాగా చదువుకున్న వారికి ఎక్కువ ప్రాధాన్యత యివ్వకుండా జాగ్రత్త పడాలి.

**పరస్పర జ్ఞాన సముపార్జన :**

గ్రామీణప్రజల అనుభవాల నుండి నేర్చుకున్న విషయాలను మనం మన సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకు నేర్పి పరస్పర జ్ఞానసముపార్జనకు అవకాశం కల్పించాలి.

## గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం - పద్ధతులు (PRA-Techniques):

### 1. మాపింగ్ టెక్నిక్ :

* గ్రామీణ సముదాయాలు మ్యాపులను వారికున్న వనరుల సహాయంతో చేస్తారు.
* తయారుచేసిన మ్యాపులు - సాంఘిక, భౌతిక, ఆర్థిక పరిస్థితులను కూడ తెలియజేస్తాయి.
* ఈ మ్యాపును PRA బృందం తదుపరి చర్చలకు ఉపయోగించుకుంటుంది.
* కార్యక్రమాల కనుగుణంగా వివిధ రకాల మ్యాపులను తయారు చేయవచ్చు.

**ఎ) సోషల్ మ్యాపింగ్ :**

* ఈ మ్యాపులో ప్రాంతపు సరిహద్దులు, నివాస పద్ధతి, మౌలిక వసతులు, సాంఘిక, సాంస్కృతిక మతసంస్థల గురించి సమాచారాన్ని కూడ పొందు పరుస్తారు.
* ఈ మ్యాపులను స్థానిక ప్రజల భాగస్వామ్యంతో మొదట నేలమీద గీసి, తరువాత తగిన గుర్తులు మరియు రంగులతో పేపరు మీద గీస్తారు.
* ఈ మ్యాపులను గ్రామస్థులతో చర్చించేటప్పుడు వాడుతారు. దీనివల్ల మ్యాపింగ్ అనునది స్థానికులలో అనవసర భయాలను తొలగించి ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది.

**బి) ట్రాన్సాక్ట్ వాక్ (Transact walk):**

* పైన తయారు చేయబడిన మ్యాపు మరియు ఆ ప్రాంతం బాగా తెలిసిన బృందం సహాయంతో PRA టీమ్ మ్యాపులో చూపబడిన ప్రాంతానికి నడచివెళ్తారు.
* నడచి వెళ్లేటప్పుడు ఆ ప్రాంత విషయాలను గ్రామస్థుల సహాయంతో క్షుణ్ణంగా తెలుసుకుంటారు.
* ఈ ట్రాన్సాక్ట్ వాక్‌లో కొన్ని ప్రధాన సమస్యలపై దృష్టి కేంద్రీకరించుటకు విస్తరణ అధికారికి సహాయపడతాయి.

**సి) వెన్ డయాగ్రం (Ven Diagram):**

* గ్రామస్థుల అభివృద్ధికి దోహదపడే వివిధ సంస్థలు-అవిపోషించే పాత్ర, వాటి పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవడానికి వెన్ డయాగ్రం ఉపయోగపడుతుంది.
* వెన్ డయాగ్రం వల్ల ప్రజలు తమజీవిత సమస్యల గురించి ఆయాసంస్థలు ఎంత వరకు అర్థం చేసుకున్నారో తెలుసుకొనుటకు కూడ ఉపయోగపడతాయి.
* ఈ పద్ధతిలో కొన్ని విషయాలపై ఎక్కువ చర్చలు జరిపి చర్చల్లో పాల్గొన్న వ్యక్తులే ఒక నిర్ణయానికి వచ్చేటట్లు చేస్తుంది.

### 2. రాంకింగ్ టెక్నిక్ (Ranking Technique):

* సాధారణంగా నాలుగు రకాల రాంకింగ్ టెక్నిక్‌లను ఉపయోగిస్తారు.

**ఎ) సమస్యలు - ప్రాధాన్యత నివ్వవలసిన సమస్యలు :**

* పాల్గొన్న వ్యక్తులను వారి వారి సమస్యలను చెప్పమని - ఆ సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో సూచించమంటారు.

**బి) మ్యాట్రిక్స్ రాంకింగ్ మరియు స్కోరింగ్ (Matrix Ranking and Scoring):**

ఈ పద్ధతిలో సమస్యలను అనేక రకాల ప్రమాణ పద్ధతులలో విశ్లేషించి అప్పుడు ఆ

సమస్యలను ప్రాధాన్యతను  బట్టి రాంకింగ్ ఇస్తారు.

**సి) పెయిర్ వైజ్ రాంకింగ్ (Pair-wise ranking):**

సమస్యలను ఎంపిక చేయుటకు వాడబడే ప్రమాణ పద్ధతులను రెండింటిని కలిపి మూల్యాంకనము చేయడాన్ని Pair-wise ranking అంటారు.

**డి) వెల్త్ రాంకింగ్ (Wealth ranking):**

సమాజంలో వివిధ ఆర్థిక స్తోమతలు కలిగిన ప్రజలు వుంటారు. వారి ఆర్థిక స్థోమతలను బట్టి విస్తరణాధికారి అవగాహన చేసుకుని అర్హత కలవారికి సహాయం చేయుటకు ఎంపిక చేస్తారు.

**3. ట్రెండ్ అనాలిసిస్ (Trend analysis):**

* ఇది సాధారణంగా దృశ్య ఆధారిత పద్ధతులు ; ఇవి మూడు రకాలు.

**ఎ) సీజనల్ క్యాలెండర్స్ (Seasonal Calenders):**

* కొన్ని సమస్యలు తిరిగి మరల మరలా వస్తూంటాయి. అటువంటి ఋతు ఆధారిత సమస్యలను విశ్లేషించడంలో ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

**బి) టైమ్‌లైన్ (Time Line):**

* గ్రామస్థుల అభివృద్ధి కొరకు చేపట్టబడిన  ప్రక్రియలు కాలాను గుణంగా ఎలా మార్పు చెందాయని గ్రామస్థులుఅనుకుంటున్నారో అర్థం చేసుకోవడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

**సి) డెయిలీ ఏక్టివిటీ చార్ట్ (Daily activity chart):**

* సమాజంలో ఉండే ప్రజల దినచర్యలను రేఖాచిత్రం ద్వారా చూపించడాన్ని "Dailyactivitychart" అంటారు. ఈ   పద్ధతి సమాజంలో ఉండే వివిధ రకాల ప్రజల దినచర్యలను పోల్చడానికి ఉపయోగపడుతుంది.

## అధ్యాయము - 9

## నాయకత్వము (Leadership)

**నాయకత్వమునకు అనేక రకాల నిర్వచనాలు యిచ్చారు. ఈ క్రింద మూడు నిర్వచనములు ఇవ్వబడినవి.**

1. ఒకరు లేదా ఎక్కువ మంది ఒక సమూహంగా సహాయసహకారాలతో పనిచేయు చున్నపుడు ఆ పనివల్ల ఆ సమూహం యొక్క అవసరాలు తీర్చడం "నాయకత్వము" అంటారు. (Hepple)
2. ప్రత్యేక లక్షణాలు గల సమూహాలు ఒకరికొకరు తోట్పాటు నందించుకుంటూ ఒక విషయంపై అవగాహన పెంపొందించుకొనుటను "నాయకత్వం" అందురు.
3. ఒకపని కొరకు సమూహంలో జీవించు ప్రజల మధ్య మంచి సంబంధ బాంధవ్యాలు ఏర్పరచి వారు అనుకున్నది సాధించుటకు ఉపయోగ పడేది "నాయకత్వం".

**నాయకుల విభజన (Classification of Leaders):**

Whyte అనుశాస్త్రవేత్త నాయకులను 4 రకాలుగా విభజించెను.

1. పని నిర్వహణకు సంబంధించిన నాయకులు (Operational Leaders)
2. చాలామంది అభిమానం పొందిన నాయకత్వం (Popular Leadership)
3. తమంతట తాము ప్రాతినిధ్యం వహించుట (Assumed representatives)
4. ప్రజాదరణ గలిగి సహజసామర్థ్యం గల నాయకులు (Prominent Leaders)

**1. పని నిర్వహణకు సంబంధించిన నాయకులు (Operational Leaders):**

సమూహంలో సభ్యత్వం ఉన్నా లేకపోయినా ఎవరైతే పనిచేయడానికి ముందుకు వస్తారో వారిని పని నిర్వహణకు సంబంధించిన నాయకులు.

**2. చాలామంది అభిమానం పొందిన నాయకత్వం (Popular Leaders):**

సమూహంలో సభ్యత్వం ఉన్నా లేకపోయినా సమూహం కోసం ఏదైనా కొంచెం పని ప్రారంభించిన ఎడల వారిని "మెరిసే నాయకులు" లేదా "సాధారణ నాయకులు" అంటారు.

**3. తమంతట తాము ప్రాతినిధ్యం వహించుట (Assumed Leaders):**

ఒక వ్యక్తి తనకు తాను ఒక "గ్రూపు" ప్రతినిధిగా భావించి ఇతర నాయకులతో లేదా ఇతర గ్రూపులతో కలిసి పని చేయడానికి ముందుకు వస్తాడు.

**4. ప్రముఖమైన/ప్రజాదరణ కలిగిన సహజ సామర్థ్యం కలనాయకులు :**

నిపుణత మరియు మేధోసంపత్తి కలిగి ప్రజలకు సేవచేసే ప్రజాదరణతో నాయకులవుతారు.

**మరొక విభజన :**

**1. వృత్తి పరమైన నాయకులు (Professional Leaders):**

తాను పనిచేయు రంగంలో ప్రత్యేక శిక్షణ పొంది ఆ రంగంలో మంచి ఫలితాన్ని పొందువారు.

ఉదా : విస్తరణాధికారి, గ్రామసేవిక

**2. ఏమి తెలియని నాయకులు (Lay Leaders):**

వృత్తి పరమైన శిక్షణ పొంది వుండవచ్చు లేదా పొందకపోవచ్చు. కాని వీరు చేయు పనికి ఫలితం వుండదు.

ఉదా : గ్రామ సహాయకుడు, యూత్‌క్లబ్‌ప్రెసిడెంటు.

**నాయకుల యొక్క అధునాతన విభజన (Modern classification):**

అధునాతన ఫలితాలను దృష్టిలో వుంచుకుని మూడు విధాలుగా విభజించవచ్చు.

1. **అపరిమిత అధికారాలు గల నాయకులు (AutoCraticLeaders)పూర్తిగా తమ ఆధీనంలో వుంచుకుని - నియమాలను ఖచ్చితంగా పాటించి అపరిమిత అధికారాలు గల నాయకులు (Autocratic Leaders) :**

   * ఇతను ఎవరినీనమ్మడు
   * ఇతని వద్ద పనిచేసే వారు చేయవలసిన పనిని చేయరని భావిస్తాడు.
   * ఉద్యోగులకు పనిచేసినందుకు ఫలితం వుంటుంది కాబట్టి వారు తప్పక పనిచేయవలెన ని భావిస్తాడు.

* ఉదార స్వభావం గల నాయకుడైతే ఇతరుల సమస్య పరిష్కారాలకు తోడ్పడాలని భావిస్తాడు.

**2. ప్రజాస్వామ్య నాయకులు (Democratic Leaders):**

* ఈ నాయకులు నిర్ణయాలు తీసుకోబోయే ముందు ఇతర నాయకులతో చర్చిస్తారు.
* ప్రతి సభ్యుడు పాలు పంచుకునే విధంగా ప్రోత్సహిస్తాడు.
* ప్రతి సభ్యుడు తాను బాధ్యత తీసుకుంటే బాగుంటుంది. అనే విధంగా ఇతడు పనిచేస్తాడు.
* ఉద్యోగస్థుల స్థాయి, వారి మనోభావాలను తెలుసుకొనుటకు ప్రయత్నం చేస్తారు.
* ఇతడు అనవసరమైన విమర్శలు చేయడు. కాని ఫలితాలను రాబట్టుకోవడానికి మాత్రం విమర్శిస్తాడు.

**3. అపరిమిత స్వాతంత్ర్యము కల నాయకులు :**

* ఇతను పనిచేయు వారిని ఒంటరిగా వదిలేస్తే పని త్వరగా పూర్తవుతుందని నమ్ముతాడు.
* ఇతని మీద ఇతనికి నమ్మకం వుండదు. వీలయితే నిర్ణయం తీసుకోవడం మానేస్తాడు.
* సమూహం నుండి వైదొలగడానికి ప్రయత్నిస్తాడు.
* ఇతను తరచుగా హేతువాది.

**వీని నాయకత్వంలో ఈ క్రింది దుష్ఫలితాలు చవిచూడవచ్చు :**

1. వీరివద్ద పనిచేసే ప్రభుత్వ - ప్రభుత్వేతర సిబ్బందికి తక్కువ నైతిక స్థైర్యము, తక్కువ పని సామర్థ్యం వుంటుంది.
2. ఉద్యోగస్థులకు విశ్రాంతి వుండదు - వారికిచ్చే ప్రోత్సాహకాలుండవు.
3. ఉద్యోగులు ఉద్యోగభద్రతే గొప్పప్రోత్సాహకమని భావిస్తారు.
4. పాలన, పర్యవేక్షణ మరియు సమన్వయ సమస్యలు రెట్టింపు అవుతాయి.

**నాయకుల ఎన్నిక మరియు శిక్షణ (Selection and training of Leaders):**

**నాయకుల ఎన్నిక (Selection of Leaders):**

**1. వృత్తిపరమైన నాయకుల ఎన్నిక (Selection of Professional Leaders):**

* పురాతన కాలం నుండి ప్రాచుర్యంలో వున్న పద్ధతి.
* మౌఖిక పరీక్ష మరియు నేర్చిన విద్య - వృత్తి సంబంధమైన వాస్తవానుభవాలను మూల్యాంకనము చేయడం ద్వారా ఎన్నుకుంటారు.
* మౌఖిక పరీక్ష (Interview) ద్వారా వ్యక్తిని కొంతవరకు అంచనా వేయవచ్చు.
* పరిశ్రమలలో ముఖ్యంగా విద్యా సంబంధమైన మరియు వాస్తవ అనుభవాలపై పరీక్షిస్తారు.
* కొన్ని పరిస్థితులలో 7-8 మందికి కలిపి ఒక అంశానిచ్చి చేయమనడం ఇందులో ఒక పద్ధతి.
* పరీక్షాసమయంలోనే నాయకత్వ లక్షణాలను గుర్తించి ఎంపిక చేస్తారు.
* గ్రూపులో ఒక వ్యక్తిని ఎన్నుకుని ఆ గ్రూపులో మిగిలిన వారిని ఎలా నడిపిస్తాడో పరిశీలించుట మరొకపద్ధతి. ఈ పద్ధతిలో ప్రయోజనం నిత్యజీవిత పరిస్థితులలో నాయకుడయ్యేందుకు అవసరమైన లక్షణాలున్నాయా లేదా అని పరిశీలించవచ్చు.

**2. ఏమి తెలియని నాయకుల ఎన్నిక :**

**1. సోషియో మెట్రి (Sociometry):**

విస్తరణాధికారి గ్రామమును సందర్శించినపుడు ప్రజలతో సంబాషించునపుడు ఏ వ్యక్తులు

వ్యవసాయ మరియు

ఇతర సమాచారముల కొరకు ఎక్కువగా సంప్రదించునో ఆ వ్యక్తిని గుర్తించి ఎన్నుకొనుట.

**2. ఎలక్షన్ పద్ధతి (Election method):**

* గ్రూపులోని సభ్యులు నాయకుడను ఎన్నుకుంటారు. విస్తరణ కార్యకర్తలు సభ్యులను ఎన్నుకొనేటప్పుడు సహాయపడతారు.
* విస్తరణ కార్యకర్త సమస్య వచ్చినపుడు చూపించవలసిన చొరవ మొదలగు లక్షణాలను వివరిస్తూ సహాయపడతారు.
* ఈ పద్ధతిని నాయకత్వపు శిక్షణ ఇచ్చునపుడు కూడ వాడుకుంటారు.

**3. చర్చాపద్ధతి (Discussion method):**

* ఎన్నుకునే వ్యక్తులతో చర్చల ద్వారా వ్యక్తి యొక్క పరిపూర్ణ జ్ఞానము మరియు సామర్థ్యతను గుర్తించి నాయకుడుగా ఎన్నుకుంటారు.

**4. వర్కుషాపుపద్ధతి (Workshop method):**

* ఈ పద్ధతిలో పెద్దగ్రూపును చిన్న గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి చిన్న గ్రూపునకు ఒక నాయకుడిని ఎంపికచేసి ఆ నాయకునకు కార్యక్రమ బాధ్యత మరియు నిర్ణయము తీసుకోవడంలో స్వేచ్ఛ నిస్తారు.

**5. గ్రూపు పరిశీలకుడు (Group observer):**


* గ్రూపు పనిచేస్తున్నపుడు విస్తరణ కార్యకర్త ఏ సమయంలో నైనా పరిశీలించి నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ పద్ధతి సమ్మర్థ వంతంగా ఉండాలంటే గ్రూపునకు విస్తరణ కార్యకర్త పరిశీలిస్తున్నాడనే విషయం తెలియకూడదు.

**6. కీ-ఇన్ఫార్మెంట్స్ (Key informants):**

* ప్రజలనే ఆ ప్రాంత నాయకుల పేర్లను సూచించవలసినదిగా కోరుతారు.
* ఈ పద్ధతి వలన కాలము మరియు ధనమును వృధా కాకుండా చూడవచ్చు.

**7. సెల్ఫ్ డిసిగ్నేటింగ్ టెక్నిక్ (Self designating technique):**

* ఈ పద్ధతిలో నాయకుడుగా ఎన్నుకోబోయే వ్యక్తిని వరుస ప్రశ్నలు అడిగి అతను నాయకుడిగా ఎన్నుకొనుటకు ఏ స్థాయిలో ఉన్నాడో అతని ద్వారానే తెలుసుకుంటారు.




సోషియోగ్రామ్

**నాయకుల శిక్షణ (Training of Leaders):**

* బోధించదగిన లేదా నేర్చుకోదగిన అంశములున్నపుడే నాయకులకు శిక్షణ అవసరం.

**A. వృత్తి పరమైన నాయకుల శిక్షణ (Training professional Leaders) :**

**1. కళాశాల (లేదా) ఇతర సంస్థలలో బ్యాక్‌గ్రౌండు కోర్సులు (In College or Institutes):**

* వృత్తిపరంగా నాయకత్వం వహించాలనుకునే విద్యార్థికి సాంఘిక పరిస్థితులపై అవగాహన అవసరం. అందువలన అటువంటి విద్యార్థులు వృత్తి విద్యతో బాటు మనోవిజ్ఞాన శాస్త్రము (Psychology) మరియు సమాజ అధ్యయన శాస్త్రం ( ) లో ప్రవేశం తప్పని సరిగా వుండాలి.

**2. ఇండక్షన్ ట్రైనింగ్ (Induction Training):**

* ఆయావృత్తులలో అనుభవజ్ఞుడైన నాయకుని దగ్గర శిక్షణ పొందిన విజయవంతమైన నాయకత్వ లక్షణాలు పొందుతాడు.

**3. ఇన్ - సర్వీస్ ట్రైనింగ్ (In-Service Training):**

* కొంత కాలం వారి వారి వృత్తులలో పనిచేసినవారు, కొంత అనుభవం సంపాదించిన తరువాత-కాలాను గుణంగా వృత్తి విద్యలలో అనేక మార్పులు వస్తాయి కాబట్టి - వారి నందరిని ఒక చోటకు చేర్చి నిర్ణీత కాలంలో వారి సమస్యలపై - వారి అనుభవాలపై మరియు వృత్తి విద్యలో సంభవించిన మార్పులపై అధ్యయనం చేయాలి.

**B. స్థానిక నాయకుల శిక్షణ (Training Local Leaders):**

**శిక్షణావశ్యకత (Need for training):**

* ఒక ప్రాంతంలో ఒక వ్యక్తిని ప్రజలు అతిగా నమ్మడం వల్ల ఆ వ్యక్తిని ఆ ప్రజలు నాయకుడుగా భావిస్తారు.
* నాయకుడుగా గుర్తించిన వ్యక్తికి కావలసిన నాయకత్వ లక్షణాలు ఉండకపోవచ్చు.
* అంతేగాక జ్ఞానము, అనుభవం, సమకాలపరిస్థితులకు అనుగుణంగా ఉండక పోవచ్చు.
* కాబట్టి విస్తరణ కార్యక్రమంలో వారి సామర్థ్యం, వారిలోగల నిగూఢ శక్తులను బయటకు తీసుకురావడానికి శిక్షణ యివ్వాలి.

# అధ్యాయము - 10
# సమాజాభివృద్ధి
## (Community Development)

**సమాజము (Community):**

ఒక ప్రాంతంలో సాంఘిక సంబంధాలు కలిగి వుండే వ్యక్తులను "సమాజం" అంటారు. ఒకే సమాజంలో అనేక జాతుల వారు, మతాలవారు, కులాలవారు వారి వారి సాంఘిక, మతాచారాలను పాటిస్తూ సాంఘిక సంబంధాలు కలిగి ఒకే సమాజంగా వుంటారు.

**సమాజాభివృద్ధి (Community Development):**

సమాజాభివృద్ధి అనగా సమాజంలోగల వ్యక్తులు అన్ని విధాలుగా, అనగా సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో సర్వతోముఖాభివృద్ధి చెంది సుఖ సంతోషాలతో జీవనం గడపడమే. సమాజంలో ప్రజల కృషితో పాటు ప్రభుత్వ సంస్థల కృషితో ఏకీకృతం చేసినపుడే సమాజాభివృద్ధి జరుగుతుంది.

**సమాజాభివృద్ధి యొక్క ఉద్దేశ్యాలు (Community Development objectives):**

మనదేశంలో సమాజాభివృద్ధి యొక్క ప్రాథమిక లక్ష్యం - ప్రజల అభివృద్ధి -

| | |
|---|---|
| | ఆర్థికాభివృద్ధి |
| ప్రజల అభివృద్ధి | సామాజిక న్యాయం |
| | ప్రజాస్వామ్య ప్రగతి |

* ప్రతి గ్రామంలో బాగా పనిచేసే పంచాయితీ, సహకార సంస్థ మరియు పాఠశాల ఏర్పాటు చేయడం.
* ఈ సంస్థలు (పంచాయితీ, సహకార మరియు విద్య) సమగ్ర ప్రణాళికలను తయారు చేసి అమలు పరచి క్రింది విషయాలలో అభివృద్ధి చేయవలెను.
    1. ఉత్పత్తి పెంచుట (వ్యవసాయం/పారిశ్రామిక/ఇతర)
    2. గ్రామీణ పరిశ్రమల స్థాపన/అభివృద్ధి (SmallScaleIndustries) ఈ పరిశ్రమలు సామాన్యంగా గ్రామాలలో లభించేవ్యవసాయిక ఉత్పత్తులపై ఆధారపడి వుండుట మంచిది.
    3. కనీస ఆరోగ్య సౌకర్యములను కల్పించుట.
    4. విద్యాసదుపాయములను కలుగజేయుట.
    5. మనోవికాస కార్యక్రమాలను నిర్వహించుట.
    6. స్త్రీల మరియు చిన్న పిల్లల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుట.
* భారతదేశంలో సమాజాభివృద్ధికి 02-10-1952 న 55 సమాజాభివృద్ధి ప్రాజెక్టులతో ప్రారంభించబడింది.
* ఒక్కొక్క ప్రాజెక్ట్ - 3 అభివృద్ధి బ్లాకులు.
* ప్రతి బ్లాక్ - 100 గ్రామాలు / 60,000 - 70,000 జనాభా/50,000 ఎకరాల సాగు కలిగి వుంటుంది.
* మొట్టమొదట నుంచి వర్షపాతము లేదా నీటి పారుదల వసతులు గల గ్రామాలను అభివృద్ధి పనులకు ఎన్నిక చేయబడతాయి.
* ప్రతి ప్రాజెక్టు 3 సంవత్సరాల కాలపరిమితిలో పూర్తి చేయాలి.
* 3 సంవత్సరాల కాలాన్ని ఈ క్రింద పేర్కొనబడినట్లుగ 5 భాగాలుగా విభజించి కార్యక్రమాలు చేపడతారు.

1. **ఉద్భవదశ (3 నెలలు) :**
    * ప్రాంతాల ఎన్నిక, సర్వే, ప్రణాళిక తయారు చేయుట.
2. **ప్రారంభదశ (6 నెలలు) :**
    * సిబ్బందికి తాత్కాలిక వసతి, రవాణా సౌకర్యాలు కల్పించుట.
3. **పనిదశ (18 నెలలు) :**
    * చేపట్టిన కార్యక్రమాన్ని అమలు పరచుట.
4. **సంఘటితదశ (6 నెలలు) :**
    * పనిదశలో పూర్తికాని పనులను పూర్తిచేయుట.

**5. ముగింపుదశ (3 నెలలు) :**

* అన్ని పనులకు తుదిమెరుగులు దిద్దడం.

**ఆంధ్రప్రదేశ్‌లో 3 ప్రాజెక్టులు ప్రారంభింపబడినది.**

* తూర్పుగోదావరి జిల్లా - కాకినాడ, పెద్దాపురం.
* కర్నూలు, కడప జిల్లాలు - కె.సి కెనాల్‌ప్రాంతం.
* నల్గొండ జిల్లా - మిర్యాలగూడ, హుజూర్‌నగర్.

**సమాజాభివృద్ధికి మార్గదర్శక సూత్రాలు :**

1. ప్రజల అవసరాలను బట్టి (కనీస అవసరాలు) కార్యక్రమాలు రూపొందించి అమలు పరచాలి.

2. **బహుళప్రయోజిత కార్యక్రమాలు (Multipurpose programmes):**

   * ప్రతి వ్యక్తి తనకు తెలియకుండానే తానుచేసే పనులవలన కొద్దో, గొప్పో అభివృద్ధి జరుగుతూ వుంటుంది. కాని సమాజంలోఅందరి ప్రయత్నాలతో బహుళ ప్రయోజన కార్యక్రమాలు చేపట్టడం వల్ల "సంపూర్ణ" మరియు "సమతుల్య" సమాజాభివృద్ధి"సాధ్యమవుతుంది.

3. **వైఖరిలో మార్పులు (Change of attitude):**

   * తొలిదశలలో మంచి అభివృద్ధి సాధించాలంటే సమాజంలో గల ప్రజల వైఖరిలో మార్పులు చాల అవసరం.

4. **ప్రజల భాగస్వామ్యం (Participation of People):**

   * ప్రజల భాగస్వామ్యం పెంచడం వల్ల సమ్మర్ధ వంతమైన స్థానిక పరిపాలన - తద్వారా సమాజాభివృద్ధి జరుగుతుంది.

5. **స్థానిక నాయకత్వం (Local Leadership):**

   * స్థానిక నాయకత్వాన్ని గుర్తించుట, ఉత్సాహపరచుట మరియు శిక్షణ ఇచ్చుట - సమాజ అభివృద్ధి కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశం.

6. **యువకులు మరియు మహిళల భాగస్వామ్యము (Participation of women and youth):**

   * యువత మరియు మహిళలు భాగస్వాములయినపుడు అభివృద్ధి ఫలితాలు ఎక్కువ మందికి అందడమేకాక, దీర్ఘకాలం ఆ అభివృద్ధి నిలచి వుంటుంది.

7. **ప్రభుత్వసహాయము (Assistance from Government):**

   * ఏ కార్యక్రమాన్ని చేపట్టినా ప్రభుత్వసహాయం అతిముఖ్యమైనది. అయితే ప్రభుత్వసహాయము సరైనకాలంలో అందాలి. అందిన సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

8. **స్థిరమైన కార్యాచరణ విధానాలు మరియు పరిపాలనా ఏర్పాట్లు :**

   * స్థిరమైన కార్యాచరణ విధానాలు, ప్రత్యేకమైన పరిపాలనా ఏర్పాట్లు.
   * ఉద్యోగుల నియామకము మరియు శిక్షణ.
   * స్థానిక మరియు జాతీయ వనరుల సమీకరణ.
   * పరిశోధనవ్యవస్థ - పరిశోధనలు చేయుట - ఫలితాల మూల్యాంకనము.

9. **ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు (Voluntary Non-Govt. organizations) :**

   * సమాజాభివృద్ధి కార్యక్రమాలలో ప్రభుత్వేతర సంస్థల వనరులు - స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పూర్తిగా వినియోగించు కోవాలి.

**10. ఆర్థిక మరియు సాంఘిక ప్రగతి (Economic and Social Progress) :**

* స్థానికంగా జరిగే సాంఘిక మరియు ఆర్థికపరమైన అభివృద్ధి జాతీయ స్థాయిలో కూడ అదే విధంగా జరుగవలసిన ఆవశ్యకతను తెలియజేస్తుంది.

# అధ్యాయము - 11
# పంచాయతీరాజ్ వ్యవస్థ
## (Panchayat Raj System)

**ఉపోద్ఘాతము :**

* గ్రామాలు, మండలాలు, పట్టణాలు, నగరాలు, జిల్లాలు, తమ వ్యవహారాలు తామే చూచుకోవడాన్ని "స్థానిక పరిపాలన" అంటారు.
* ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పరిపాలనలో భాగస్వాములు కావాలి. అందుకు తగిన శిక్షణ ప్రజలకు అవసరము.
* దేశంలోని అన్ని ప్రాంతాల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వానికి కష్టమైనపని. వీటికి పరిష్కారాలు కనుగొనాలనే ఉద్దేశంతో స్థానిక స్వపరిపాలన సంస్థలను ప్రవేశపెట్టారు.
* రోడ్లు వేయడం, విద్య, వైద్య సదుపాయాలు కల్పించడం, వీధి దీపాలను ఏర్పాటు చేయడం, మంచినీటి సరఫరా నిర్వహించడం మొదలగు పనులను స్థానిక స్వపరిపాలనా సంస్థలు నిర్వహిస్తాయి.
* మనదేశంలో మొట్టమొదట మౌర్యులకాలంలో స్థానిక స్వపరిపాలన సంస్థలు ఏర్పడ్డాయి.
* బ్రిటిష్ పరిపాలనలో1882లో స్థానిక ప్రభుత్వ చట్టాల ద్వారా "లార్డ్‌రిప్పన్" భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలకు ఒక మౌలిక స్వరూపం అందించారు. అందువలన "లార్డ్ రిప్పన్" ను స్థానిక ప్రభుత్వాల పితామహుడు అని అంటారు.
* స్థానిక ప్రభుత్వాల "అనే పదాన్ని భారతరాజ్యాంగంలోని 4వ అధికరణంలో పొందుపరచారు.

**ప్రజాస్వామ్య వికేంద్రీకరణ (Democratic Decentralization):**

ప్రజల యొక్క
ప్రజల కొరకు } చేయబడు పరిపాలనను "ప్రజాస్వామ్యం" అంటారు.
ప్రజలచే

* ప్రజాస్వామ్యంలో ప్రజలకు అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వబడినది.
* కేంద్రీకృత పరిపాలనాధికారాన్ని ప్రజలకు దగ్గరగాను, అనువుగాను ఉన్న పరిపాలనా సంస్థలకు అప్పజెప్పడాన్ని "ప్రజాస్వామ్య వికేంద్రీకరణ" అంటారు.
* అధికారవికేంద్రీకరణ అనగా ప్రజలకు మరింత చేరువలోనే పరిపాలన.

**ప్రజాస్వామ్య వికేంద్రీకరణ - ఆవశ్యకత (Democratic Decentralization Need):**

* సమాజాభివృద్ధి కార్యక్రమము గ్రామాలలో నివసించు ప్రజల భాగస్వామ్యముతో ప్రజల అభివృద్ధికి తోడ్పడే విధంగా ఏర్పాటు చేయబడింది. కాని సదరు కార్యక్రమాలలో ప్రజలు సరిగా పాల్గొనక ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారు.

* కేంద్రప్రభుత్వం సమాజాభివృద్ధి కొరకు ఏ రకపు వ్యవస్థను ప్రవేశపెట్టాలో తెలియజేయమని "బల్వంత్‌రాయ్ మెహతా" ఆధ్వర్యంలో ఒక అధ్యయన బృందాన్ని 16 జనవరి 1956 న ఏర్పాటు చేసినది.
* ఈ కమిటీ "3-అంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థ" ను ఏర్పాటు చేయమని సిఫారసు చేసింది.
* భారతరాజ్యాంగ సూత్రాలననుసరించి "పంచాయితీరాజ్ వ్యవస్థ" ను రాజస్థాన్‌లో తరువాత 1959 నవంబర్ 1న మనరాష్ట్రంలో హైదరాబాద్ జిల్లాలోని "షంషాబాద్" పట్టణమునందు ప్రవేశపెట్టారు.

**మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థ (Three tiers of Panchayat Raj System):**

* బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసుల మేరకు
* గ్రామపంచాయితీలు
* పంచాయితీ సమితులు
* జిల్లా పరిషత్‌లు

(గ్రామపంచాయితీలు, పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్‌లు) ఏర్పాటుచేయబడినవి.

* అవి క్రమంగా నేటి గ్రామపంచాయితీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లుగా మార్పుచెందాయి.
* గ్రామాల అభివృద్ధి కొరకు - ఆ గ్రామ ప్రజలు ఎన్నుకొన్న "స్థానిక స్వపరిపాలనా సంస్థల ద్వారా సాంఘిక, ఆర్థిక ప్రణాళికలు అమలుచేయబడుచున్నవి.
* అందువలన "పంచాయితీరాజ్ వ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది.

**ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ద్వారా ఈ క్రింది పదాలను నిర్వచించడం జరిగింది :**

1. **జిల్లా** : ఒకరాష్ట్రంలోని నిర్ధిష్ట ప్రాదేశిక పరిధిగల ప్రాంతం.
2. **గ్రామసభ** : గ్రామస్థాయిలో పంచాయితీ పరిధిలోని ఒక గ్రామంలో ఓటర్లజాబితాలో రిజిష్టర్ కాబడిన సభ్యుల సమూహము.
3. **మాధ్యమికస్థాయి** : జిల్లాస్థాయికి, గ్రామస్థాయికి మధ్యగల స్థాయిని మాధ్యమికస్థాయి అంటారు. మాధ్యమిక స్థాయికి "పంచాయితీరాజ్ కమీషనర్" అధికారిగా యుండి జిల్లాకలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళికలను అమలు చేస్తారు.
4. **పంచాయతీ ఏరియా** : ఒక పంచాయితీ ఆధ్వర్యంలో గల గ్రామాలు.
5. **గ్రామము** : జిల్లా కలెక్టర్ చేత "గ్రామము" గా నోటిఫై చేయబడిన ప్రాంతం.

**మూడంచెల పంచాయితీరాజ్ స్వరూపము :**

1. క్రిందిస్థాయి - గ్రామపంచాయితీ
2. మాధ్యమిక స్థాయి-బ్లాక్ సముదాయాలలో పంచాయితీ సమితి (కొన్ని గ్రామపంచాయితీలను కలిపి-దానికి "బ్లాక్" గా ఏర్పరుస్తారు.(పంచాయితీ సమితి)
3. పై స్థాయి - జిల్లా పరిషత్

**1. గ్రామపంచాయితీ :**

* కనీస జనాభా 2500 ఉంటే పంచాయితీ ఏర్పడుతుంది. కాని నేడు 500 కంటె జనాభా ఉన్న ప్రతి గ్రామానికి ఒక పంచాయితీ ఉన్నది.

* మన రాష్ట్రంలో అటువంటి పంచాయితీలు 27,445 ఉన్నాయి. గ్రామ పంచాయితీ అధ్యక్షుడుని "గ్రామ సర్పంచ్" అంటారు.
* గ్రామ సర్పంచిని ఆ గ్రామ ఓటర్లందరూ రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకుంటారు.
* జనాభా ప్రాతిపదికగా ప్రతి గ్రామాన్ని 6 నుండి 16 వార్డులుగా విభజిస్తారు.
* ప్రతివార్డు నుండి ఒక సభ్యుడిని గ్రామ పంచాయితీ ఓటర్లు ఎన్నుకుంటారు.
* పంచాయితీ సభ్యత్వ సంఖ్య 5 కు తగ్గకుండా 21 కి మించి ఉండాలి.
* స్త్రీలకు, షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు తెగలకు ప్రత్యేకంగా కొన్ని స్థానాలను కేటాయించి ఎన్నుకుంటారు.
* ఈ వార్డ్ సభ్యులు తమలో ఒకరిని గ్రామ ఉపసర్పంచిగా ఎన్నుకుంటారు.
* గ్రామపంచాయితీ పదవీకాలం 5 సంవత్సరాలు.

**గ్రామపంచాయితి విధులు :**

1. ప్రజారోగ్యము మరియు పారిశుద్ధ్యము
2. నీటి సరఫరా
3. వీధి దీపాలు
4. జనన మరణాలు నమోదు చేసుకొనుట
5. మాతాశిశు రక్షణ
6. గ్రామంలో రోడ్లు, చెరువులు, బావులు ఏర్పాటు చేయడము మరియు వాటికి మరమ్మత్తులను చేయించుట.
7. ప్రాథమిక విద్యా ఏర్పాట్లు
8. ఆసుపత్రులు, గ్రంధాలయాలు మరియు పఠనామండలాలను ఏర్పాటు చేయుట
9. పండగలు, జాతర్లను మరియు సంతలను జరుపుట
10. ప్రభుత్వ భూముల్లో చెట్లు నాటించుట
11. ఇంటి మరియు వృత్తి పన్ను వసూలు చేయుట

**గ్రామపంచాయితీల ఆదాయము (Gram Panchayat - Revenue):**

1. వృత్తిపన్ను
2. ఇంటిపన్ను
3. ప్రభుత్వం నుండి వచ్చే ధన సహాయం
4. ప్రజల నుండి వచ్చే విరాళాలు

పంచాయితీలకు కార్యనిర్వహణాధికారులను ప్రభుత్వం నియమిస్తుంది.

**గ్రామసభ :**

* గ్రామాలలో పంచాయితీలే కాకుండా గ్రామసభలు కూడ ఉన్నాయి.
* గ్రామంలోని ఓటర్లందరూ గ్రామసభలో సభ్యులుగా వుంటారు.
* ఈ సభ సంవత్సరానికి రెండు సార్లు సమావేశమవుతుంది.
* ఈ సమావేశానికి గ్రామ సర్పంచి గాని అతడు అందుబాటులో లేనట్లయితే గ్రామ ఉపసర్పంచ్‌గాని అధ్యక్షత వహిస్తారు.
* గ్రామపంచాయితీ పరిపాలనా నివేదికను చర్చించడం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టడానికి చర్చించబడతాయి.

* కొత్తగా విధించవలసిన పన్నులను, పెంచదలచిన పన్నులను ఇతర ముఖ్యాంశాలను ఈ సభ చర్చిస్తుంది.
* గ్రామసభ సూచనలను పరిగణనలోనికి తీసుకుని అమలుచేయటానికి గ్రామపంచాయితీ కృషి చేస్తుంది.

**2. పంచాయతీ సమితి (Panchayat Samithi):**

పంచాయతి సమితి మెంబర్లను వివిధ ప్రాతిపదికల ఆధారంగా ఎన్నుకుంటారు.

1. పంచాయతి సమితి బ్లాకులోని అందరు సర్పంచులు.
2. ఆ బ్లాకుకు సంబంధించిన నియోజకవర్గపు ఎం.ఎల్.ఏ లు.
3. యం.పి. వారి ఇష్టప్రకారము ఏదైనా ఒక పంచాయతి సమితిలో మెంబరు కావచ్చు.
4. కో-ఆప్షన్ పద్ధతిలో ఇద్దరు మహిళలు (ఒకరు మైనారిటీ నుండి మరియు ముగ్గురు వెనుకబడిన తరగతుల నుండి ఎన్నుకోబడతారు.

సమితి ప్రెసిడెంట్ ప్రత్యక్షంగా ఓటర్లచే ఎన్నుకోబడతారు. ప్రభుత్వ పరంగా బ్లాక్ డెవలెప్ మెంటు ఆఫీసరు సమితికి పెద్ద అధికారి. అతనిక్రింద వివిధ శాఖలకు చెందిన విస్తరణాధికారులుంటారు.

**పంచాయితీ సమితి విధులు :**

1. వ్యవసాయాభివృద్ధి.
2. పశుగణాభివృద్ధి, మత్స్యపరిశ్రమ.
3. గ్రామీణ ఆరోగ్యం.
4. ప్రాధమిక విద్య.
5. సమాజ విద్య (Social education)
6. రవాణాసౌకర్యముల ఏర్పాటు.
7. సహకారము మరియు కుటీరపరిశ్రమలు.
8. స్త్రీ శిశు సంక్షేమము మరియు సమాజ సంక్షేమము.
9. అడవులను కాపాడుట.
10. గ్రామీణ గృహవసతి.
11. గ్రామ పంచాయితీలపై తనిఖీ మరియు సలహాలనిచ్చుట.

**పంచాయతీ స్టాండింగ్ కమిటీలు :**

**స్టాండింగు కమిటీ - 1 (అభివృద్ధి) :**

1. ప్లానింగ్
2. సేద్యపు నీటి బావులు
3. పశుసంరక్షణ
4. మత్స్యపరిశ్రమ
5. భూ సంరక్షణతో సహా వ్యవసాయము
6. సహకార రంగము
7. పొదుపు
8. కుటీర పరిశ్రమలు
9. చిన్న పరిశ్రమలు
10. గ్రామీణ గృహవసతి

**స్టాండింగ్ కమిటీ - 2 (విద్య) :**

1. ప్రాథమిక విద్య
2. సామాజిక విద్య
3. ఉపాధి విద్య
4. సహకారము
5. ప్రజారోగ్యము
6. పారిశుద్ధ్యము
7. మురుగునీటి పారుదల

**స్టాండింగ్ కమిటీ - 3 (స్త్రీ సంక్షేమము, ప్రజాసంక్షేమము) :**

1. షెడ్యూల్డ్‌కులాల, షెడ్యూల్డ్‌తెగల మరియు వెనకబడిన తరగతుల సంక్షేమము
2. స్త్రీ మరియు శిశుసంక్షేమము
3. సాంస్కృతిక కార్యక్రమాలు

**స్టాండింగ్ కమిటీ - 4 (పనులు) :**

1. రహదారులు
2. నీటి సరఫరా
3. వ్యవసాయ బావులు మినహా నీటి పారుదల

**స్టాండింగ్ కమిటీ - 5 (విత్తము) :**

1. పన్నులు
2. నిధుల కేటాయింపు

పంచాయితీ సమితిలో ఎంతమంది సభ్యులుంటారో వారిని విభజిస్తే ఎందరు వస్తారో అందరు సభ్యుల ప్రతికమిటీలోను వుంటారు. సమితి ప్రెసిడెంట్ విత్తపుకమిటీ (Finance)కి మరియు వైస్‌ప్రెసిడెంట్ అభివృద్ధికమిటీకి ఛైర్మన్లుగా వుంటారు. మిగతా మూడు కమిటీల అధిపతులను ఆయాకమిటీలోని మెంబర్లు ఎన్నుకుంటారు.

**3. జిల్లా పరిషత్ (Zilla Parishad):**

* జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఆఖరుది మరియు మూడవది. ఇందులో మెంబర్లు.
    1. జిల్లాలోని అన్ని పంచాయితీ సమితుల ప్రెసిడెంట్లు.
    2. జిల్లాలో వివిధ పంచాయితీ సమితి మెంబర్లుగా వున్న ఎం.ఎల్.ఎలు, యం.పి.లు.
    3. కో-ఆప్షన్ పద్ధతిలో ఎన్నుకోబడిన ఇద్దరు స్త్రీలు (ఒకరు మైనారిటీనుండి) మరియు వెనుకబడిన తరగతుల నుండి ముగ్గురు.

జిల్లా పరిషత్ ఛైర్మన్‌ను జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. వైస్ ప్రెసిడెంట్‌ని మెంబర్లు ఎన్నుకుంటారు. ప్రభుత్వము తరపున ప్రతి జిల్లా పరిషత్‌కు ఒక చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసరు వుంటారు.

**జిల్లా పరిషత్ విధులు :**

1. పంచాయితీ సమితుల బడ్జెట్‌ను పరిశీలించి ఆమోదించుట.
2. అడ్‌హక్ గ్రాంట్లను బ్లాకులకు పంచిపెట్టుట.

3. బ్లాకుల ప్లానులను సమన్వయపరచి జిల్లా ప్లానులను తయారు చేయుట.
4. ప్లానులను, ప్రాజెక్టులను, స్కీములను అమలు పరచుట.
5. ప్రభుత్వానికి పంచాయితీ సమితుల్లో, గ్రామపంచాయితీలలో అమలు పరచవలసిన కార్యక్రమాల గురించి సలహాలిచ్చుట.
6. హైస్కూళ్లను, వృత్తి విద్య మరియు పారిశ్రామిక స్కూళ్లను (ITI) ఏర్పాటుచేసి నడుపుట.

**ప్రజాస్వామ్య వికేంద్రీకరణ పరిపాలన గుణగణాలు (Democratic Decentralization – Characteristics):**

**మంచి గుణాలు (Merits):**

1. సమాజాభివృద్ధి కార్యక్రమాలు అమలు పరచుటలో పై స్థాయిలో ప్రజాస్వామ్యం మరియు క్రింది స్థాయిలో నిరంకుశత్వం అను వ్యత్యాసము లేకుండా రెండు స్థాయిల్లోనూ ప్రజాస్వామ్యం నెలకొల్పుట.
2. పై ఆదర్శాన్ని నెలకొల్పుటకు జిల్లాలో మూడు అంచెల పరిపాలన ద్వారా ప్రజల చేతిలో అధికారాన్ని నెలకొల్పుట.
3. ప్రజలశ్రేయస్సుకు వారికి కావలసిన అభివృద్ధి కార్యక్రమాలను వారే నిర్ణయించుకొనుట.
4. పై కార్యక్రమాలను ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు నెరవేర్చుతారు.

**అవగుణాలు (Demerits):**

1. ప్రజలనుండి ఆశించినంత సహకారం అందకపోవడం.
2. మూడు స్థాయిల పరిపాలనా వ్యవస్థలలో కూడ ధనికులు లేక అగ్రకులాలవారే పదవులను చేపట్టడం.
3. ఓటింగ్ పద్ధతివల్ల వివిధ వర్గాల్లో కక్షలు, వైషమ్యాలు ఎక్కువగుట.
4. అభివృద్ధి కొరకు ఉద్దేశించబడిన వివిధ ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం లేకపోవడం.
5. పంచాయితీ రాజ్ పరిపాలన ద్వారా అమలు జరుపవలసిన కార్యక్రమాలలో ఎక్కువ భాగం చిన్నకారు రైతుల అభివృద్ధి ఏజన్సీకి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు మరియు సమగ్ర అటవీ ప్రాంతాల ప్రజల అభివృద్ధి కార్యక్రమమునకు బదిలీ చేయబడెను.

**ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థ :**

* 1977 లో జనతా ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావడంతో ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో భాగంగా అశోక్‌మెహతా అధ్యక్షతన18 మంది సభ్యులకమిటీ ఏర్పాటు చేసింది. అశోక్‌మెహతా కమిటీ తన నివేదికను 1978 ఆగష్టులో సమర్పించింది.
* రెండంచెల పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్ట మనుట ఈ కమిటీ ప్రధాన సిఫారసు.
* రెండంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ అనగా క్రింది స్థాయిలో అనగా మండల స్థాయిలో మండల పరిషత్ పై స్థాయిలో (జిల్లా స్థాయిలో) జిల్లా పరిషత్ ఏర్పాటు చేయాలని పేర్కొనినది. పై రెండు అంచెలలో ముఖ్యమైనది మండల పరిషత్.
* సిఫారసు ననుసరించి 1985 మేనెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రితం వున్న తాలూకాలను, ఫిర్కాలను రద్దుచేస్తూ వాటిస్థానే 1986 జనవరి 13న అప్పటి ముఖ్యమంత్రి డా॥యన్.టి. రామారావు, మండల పరిషత్‌లను దేశంలోనే రెండవ సారిగా ప్రవేశపెట్టారు.

మండల పరిషత్‌లను ఏర్పాటు చేసిన మొదటిరాష్ట్రం కర్ణాటక.

**వ్యవస్థాపన రీతులు మరియు ప్రత్యేక లక్షణాలు :**

* మండల వ్యవస్థలో మొట్టమొదటి అంశంగా తాలూకాలు మరియు ఫిర్కాలు రద్దుచేయబడెను.
* లోగడ తహసీల్దార్‌కు వున్న అధికారాలు మండల రివెన్యూ అధికారికి ఇవ్వబడెను. అతను ఒక మండలంలో రివెన్యూ వ్యవహారాలు చూసుకుంటాడు.
* మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు మండల అభివృద్ధి అధికారి వుంటాడు.
* ఆంధ్రప్రదేశ్‌లో 1128 మండలాలు ఏర్పాటు చేయబడెను. ప్రతిమండలం 12-14 గ్రామాలతో లేదా 35000-50,000జనాభా కలిగి వుంటుంది.
* తాలూకాలకు, పంచాయితీ సమితులకు మరియు మున్సిపాలిటీలకు కేంద్రంగా వున్న ఊర్లన్నీ మండల రివెన్యూ కేంద్రాలుగా పరిగణింప బడెను.
* ప్రతి మండల కేంద్రంలోనూ ఈ క్రింది సదుపాయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయింపబడెను.
    * బస్టాండ్ / రైల్వేస్టేషన్
    * పాథమిక ఆరోగ్య కేంద్రం
    * చిన్న ఆసుపత్రి
    * పశువుల ఆసుపత్రి
    * పోలీస్ స్టేషన్
    * తపాలా ఆఫీసు
    * టెలిఫోన్ ఎక్స్ఛేంజ్
    * ఉన్నత పాఠశాల
    * వ్యాపార సదుపాయాలు
    * వ్యవసాయానికి కావలసిన సదుపాయాలు

**మండల వ్యవస్థలో వున్న పరిపాలనా స్థాయిలు ఏమనగా :**

1. గ్రామపంచాయితీ.
2. మండల ప్రజాపరిషత్.
3. జిల్లా ప్రజాపరిషత్.
4. జిల్లా అభివృద్ధి సమీక్షామండలి.
    * పూర్వం గ్రామపంచాయితీ సర్పంచ్‌లను నేరుగా ఎన్నుకోవడం, వారి ద్వారా సమితి ప్రెసిడెంట్లను ఎన్నుకోవడం, పంచాయితీ సమితి ప్రెసిడెంట్లు, శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు కలిసి
    * జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వుండేది. ఇలాంటి ప్రజా ప్రతినిధుల మీద అవిశ్వాసతీర్మాన పెట్టే పద్ధతి వుండేది.
    * ఇప్పటి పద్ధతి ప్రకారం మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్, జిల్లా పరిషత్ చైర్మన్ పరోక్ష పద్ధతిలో ఎన్నుకోబడతారు.
    * మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్, జిల్లా పరిషత్ చైర్మన్‌లను ఎన్నుకోబడిన 2 సంవత్సరాల తర్వాత మాత్రమే అవిశ్వాస తీర్మానం ప్రకారం పదవీచ్యుతులను చేయడం వీలవుతుంది.

* మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్, జిల్లా పరిషత్ చైర్మన్‌ల పదవీ కాలంలో ఒక్కసారి మాత్రమే అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించుటకు వీలవుతుంది.
* అవిశ్వాస తీర్మానం వీగిపోతే మరల అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించుటకు వీలుపడదు.
* ప్రజలచే ఎన్నుకోబడిన MPTC,ZPTCలను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించుటకు వీలుపడదు.
* మండల ప్రజాపరిషత్ మెంబరుగా పంచాయితీ సర్పంచ్, ఏ మండలంలో సభ్యత్వం కావాలో వారి ఇష్ట ప్రకారం శాసన సభ్యుల పార్లమెంటు సభ్యులు భాషాప్రాతి పదికపై, మైనారిటీల నుండి ఒక్కొక్కరుంటారు.
* మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్ల రిజర్వేషన్ పద్ధతి ఇలా ఉంటుంది.
    * 15% షెడ్యూల్డు కులముల వారికి
    * 6% షెడ్యూల్డు తెగలవారికి
    * 20% వెనుకబడిన తరగతి వారికి
    * 9% స్త్రీలకు
    * జిల్లాప్రజాపరిషత్‌లో ఆ జిల్లాలోని మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్లు, ఆ జిల్లాలోని శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, భాషాప్రాతిపదికపై గాని మూలప్రాతిపదికపై గాని మిగతా మెంబర్లచే ఎన్నుకోబడిన ఒకేఒక వ్యక్తి (కో-ఆప్టెడ్) మెంబర్లుగా ఉంటారు.
    * జిల్లా అభివృద్ధి సమీక్షామండలి వివిధ వికాస కార్యక్రమాలను సమీక్షిస్తూ వుంటుంది. ఇందులో సభ్యులుగా
        1. వివిధ మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంట్లు.
        2. జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్.
        3. జిల్లాలోని శాసన సభ్యులు.
        4. పార్లమెంటు సభ్యులు.
        5. జిల్లా కలెక్టరు మరియు
        6. జిల్లా కేంద్రసహకార బ్యాంకు అధ్యక్షుడు.
        7. జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు.
        8. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఉంటారు.
            * రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధి సమీక్షా మండలికి ఒక మినిష్టరును అధ్యక్షులుగా నియమించ వచ్చును.
            * జిల్లాకలెక్టర్ సమీక్షామండలి కార్యదర్శిగా వుంటారు. ఇంతకు ముందున్న పంచాయితీ రాజ్ వ్యవస్థ కన్నా మండల వ్యవస్థ

**ప్రయోజనాలు :**

1. ప్రజలను వారికి ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణలో మరియు పరిపాలనలో భాగస్వాములను చేయటం.
2. షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల వారిని దళిత వర్గాలను, స్త్రీలను ప్రజాస్వామ్య పాలనలో ఎక్కువగా పాల్గొనేటట్లు చేయుట.
3. గ్రామ స్వరాజ్య స్థాపన లాంటి లక్ష్యాలు సాధించేందుకు మండల వ్యవస్థను ఏర్పాటు చేశారు.

# అధ్యాయము - 12

## విస్తరణ సంస్కరణలు (Extension reforms)

* ఇంతకు ముందున్న విస్తరణ కార్యక్రమాలలో ఎక్కువ భాగం పైస్థాయిలో నిర్ణయాలు తీసుకుని క్రింద స్థాయిలో అమలు చేయబడేవి.
* ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచడం, రైతు యొక్క స్థూల ఆదాయాన్ని పెంచడంపై దృష్టిని కేంద్రీకరించలేదు.
* వ్యవసాయ విస్తరణాధికారులు వ్యవసాయ కార్యక్రమాల మీద కంటె ప్రభుత్వ సబ్సిడీలను పంచేదానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు.
* వివిధ శాఖలలో వున్న విస్తరణాధికారుల మధ్య సమన్వయం లోపించడం.

పైన పేర్కొనబడిన కారణాలవల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేక పోయాము.

* పై సమస్యలను అధిగమించుటకు 1990 వ సంవత్సరములో భారతప్రభుత్వం మరియు ప్రపంచబ్యాంకు కలిసి విస్తరణలో క్రొత్త మార్గాలను అన్వేషించడం మొదలు పెట్టినవి.
* ఇందులో భాగంగానే వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధశాఖల కార్యక్రమాలపై దృష్టి పెట్టి వ్యవసాయాదాయాన్ని పెంచుటకు, గ్రామీణ ఉపాధి కల్పనల కొరకు ఉద్దేశించబడిన క్రొత్త మరియు వికేంద్రీకరించబడిన విస్తరణ కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగింది.
* ప్రస్తుతం అమలులోవున్న విస్తరణ సంస్కరణల వలన క్రింది స్థాయిలో రైతులకు లాభసాటి కార్యక్రమాలను అమలు పరచడం వీలగుచున్నది.

### వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (Agrl.Technology Management Agency (ATMA):

* జిల్లాస్థాయిలో వ్యవసాయ సాంకేతిక వ్యాప్తికి తోడ్పడే అధికారిక సంస్థ.
* వ్యవసాయ మరియు వ్యవసాయ సంబంధిత అనుబంధశాఖల పనులకు సంబంధించిన నిధులను అందుకుని మరియు ఖర్చుపెట్టే సంస్థ.
* ATMA సంస్థ కాంట్రాక్ట్‌లు మరియు ఒప్పందాలలో పాల్గొంటూ మరియు రుసుముల వసూలుకు సంబంధించిన ఖాతాలు పర్యవేక్షణ ద్వారా నిర్వహణ వ్యయాన్ని సమకూర్చుకుంటుంది.

### ATMA లక్ష్యాలు - ఉద్దేశ్యాలు (Aims and Objections):

1. వ్యవసాయ, వ్యవసాయసంబంధిత సంస్థల అభివృద్ధి కొరకు ప్రాంతీయ అవసరాలను గుర్తించడం.
2. వ్యవసాయ ప్రాధాన్యాలను ఏర్పాటు చేయడం.
3. వ్యవసాయ ఉత్పత్తి పనుల ప్రణాళికలను తయారుచేసి వ్యవసాయదారులకు అందించడం.
4. వ్యవసాయ అనుబంధశాఖలు, ప్రభుత్వేతర సంస్థలు (NGO'S), వ్యవసాయదారుల సంఘాలు మరియు సంబంధిత సంస్థల ద్వారా ప్రణాళికలను అమలుచేయడం.
5. అనుబంధశాఖలు, ప్రభుత్వేతర సంస్థలు, వ్యవసాయదారుల సంఘాలకు పరిశోధనా, విస్తరణ, వివిధ రాష్ట్రప్రభుత్వ ఆర్థిక సహాయం పొందేశాఖల మధ్యసమన్వయం పెంపొందించడం.
6. ప్రణాళికరచన - అమ్మకం, సాంకేతిక విజ్ఞాన వ్యాప్తి, అగ్రోప్రాసెసింగ్‌ల సంఘాలు, సహకార సంఘాలకు ఎక్కువ భాగస్వామ్యం కల్పించడం - తద్వారా వ్యవసాయ దారులను బలోపేతం చేయడం.

7. వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెరిగే విధంగా మార్కెట్ అనుబంధాలు పెంచడం.

* ATMA సాంకేతిక వ్యాప్తికి దోహదపడే సంస్థ.
* అన్నివ్యవసాయ అనుబంధశాఖలు, పరిశోధనాసంస్థలు, NGO లు ATMA సంబంధాలు కలిగి వుంటుంది.
* వ్యవసాయ పరిశోధనా సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, విస్తరణ విభాగాలు వ్యవసాయ అనుబంధ శాఖలు, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ మరియు మత్స్యశాఖ మొదలైనవి ATMA లో అంతర్భాగాలు.

**1-మార్చి, 2012**

directornrrap@gmail.com